# విశాల భారతి

తెలుగు దినపత్రిక

03-08-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

సోమవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 209





## కాంగ్రెసోళ్లది మిడిమిడి జ్ఞానం

- బీఆర్ఎస్ నేతల తీవ్ర ఆగ్రహం.. నీటిపై అవగాహన లేదంటూ విమర్శలు
- గాయత్రి పంప్ హౌస్ పరిశీలన.. కాంగ్రెస్ తీరుపై ధ్వజమెత్తిన వైనం
- ప్రాజెక్టులు వెంటనే నింపాలని డిమాండ్.. కేసీఆర్ ఆధ్వర్యంలో పోరాటాల హెచ్చరిక

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** రాష్ట్ర ముఖ్యమంత్రికి కానీ లేదంటే మంత్రులకు కానీ నీటి పారుదల రంగంపై కనీస అవగాహన లేదని ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సాగునీటి ప్రాజెక్టులను సకాలంలో నింపకుండా మిగతా 2లో..




## పటాన్‌చెరుపై ఎస్ఐఆర్ దెబ్బ

- పటాన్‌చెరులో ఎస్ఐఆర్ ప్రక్రియ కలవరం
- లక్షన్నర ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం
- పట్టణ ఓటర్లలో కన్పించని స్పందన
- జిల్లాలోనే ఆఖరున నిలిచిన నియోజకవర్గం
- కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో వణుకు
- ప్రత్యేక ప్రచారాలతో నేతల కసరత్తు

03




## మణికొండ జాగీర్ ప్రభుత్వ భూమిపై మళ్లీ ఆక్రమణ యత్నం

- నిర్లక్ష్య అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

05

# పింఛన్ లబ్ధిదారులు @50 లక్షలు!

## కులగణన ఆధారంగా అర్హులందరికీ పింఛన్లు



- 15 నుంచి తలసేమియా బాధితులకు సాయం
- దివ్యాంగుడైన భర్త మరణిస్తే కొనసాగింపు
- సర్వే ద్వారా 10.35 లక్షల మంది గుర్తింపు
- ఖజానాపై ఏటా రూ. 2,500 కోట్ల భారం
- రాష్ట్రంలో 41.06 లక్షల మందికి అందజేత

> తెలంగాణలో అర్హులైన అందరికీ సామాజిక భద్రత పథకాలను అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. దశలవారీగా కొత్త లబ్ధిదారులను ఎంపిక చేస్తోంది. ఇటీవల నిర్వహించిన కులగణన గణాంకాల ఆధారంగా ఒక్కో కేటగిరీ కింద పింఛన్ స్కీమ్‌ను విస్తరించాలనుకుంటోంది. పంద్రాగస్టు నుంచి తలసేమియా, సికిల్సెల్ ఎనిమియా బాధితులకు కూడా పింఛన్లను ఇవ్వనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. దివ్యాంగుల విషయంలో భర్త చనిపోతే ఆ పింఛన్ సాయాన్ని భార్యకు కొనసాగించాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. రానున్న రోజుల్లో అర్హులైన అందరినీ పింఛన్ల పరిధిలోకి తేవాలని సర్కారు భావిస్తున్నది. కొత్తగా సుమారు 10 లక్షల మంది అర్హులు ఉంటారని, వీరిని లబ్ధిదారులుగా చేరిస్తే ఖజానాపై ఏటా సుమారు రెండున్నర వేల కోట్ల మేర అదనపు భారం పడుతుందని అంచనా.

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ఆర్థిక పరిస్థితికి తగినట్టుగా కొత్త లబ్ధిదారులను జాబితాలో చేర్చడంపై నిర్ణయం తీసుకోనున్నారు. ఈ విధానంతో బలహీన వర్గాలకు ఎంతో భరోసా లభిస్తుందని నమ్ముతున్నారు. ఇప్పటివరకూ పదకొండు రకాల పింఛన్లు అమల్లో ఉండగా ఈ ఏడాది పంద్రాగస్టు కానుకగా తలసేమియా, సికిల్ సెల్, ఎనిమియా బాధితులకు కూడా అందనున్నాయి. ఆ తర్వాత అర్హులైన ఇతర మిగతా 2లో..

## మెజారిటీ ఇస్తేనే పోటీ

### సొంతిల్లు లేదని, ప్రజాసేవకే జీవితమంటూ కన్నీరు

- మెజారిటీ ఇస్తేనే పోటీ అన్న మంత్రి కోమటిరెడ్డి
- ఎస్ఎల్బీసీ, బ్రాహ్మణ వెల్లం ద్వారా రెండు పంటలకు నీరు
- కంచనపల్లికి రూ. 3 కోట్లు కేటాయింపు
- దోమలపల్లిలో ఏర్పాటుకు నిర్ణయం
- వారానికి రెండు రోజులు నల్లగొండలోనే మకాం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్లగొండ నియోజకవర్గంలో ఇటీవల చేసిన సంచలన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. కంచనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేయడంపై కీలక స్పష్టతనిచ్చారు. నల్లగొండ ప్రజలు తనను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని స్పష్టమైన హామీ ఇస్తేనే బరిలోకి దిగుతానని తేల్చిచెప్పారు. లేదంటే ఎన్నికల పోటీ నుంచి పూర్తిగా తప్పుకుంటానని సంచలన ప్రకటన చేశారు. తాను స్వయంగా ప్రచారానికి రాకపోయినా నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి పనులను చూసి ఓట్లేసి గెలిపించాలని ప్రజలను ఆయన కోరారు. తన వ్యక్తిగత జీవితం గురించి ప్రస్తావిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. తనకంటూ ప్రత్యేకంగా సొంత ఇల్లు ఆస్తులు ఏవీ లేవని మంత్రి తెలిపారు. తన జీవితమంతా పూర్తిగా ప్రజాసేవకే అంకితం చేశానని మిగతా 3లో..



## నెలకే రోడ్డు చిందరవందర.. ప్రజాధనం వృథా!

- కేఎస్ఆర్ లేఅవుట్‌లో నాసిరకం పనులపై టీఆర్ఎస్ ఆగ్రహం
- కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

03



## రేవంత్‌ను ఎదురించాల్సిందే

### బోనాల ఏర్పాట్లలో ప్రభుత్వం ఫెయిల్

- రంజాన్‌తో పోలిస్తే బోనాలకు నిధులు తక్కువేనని విమర్శ
- బోనాల వసతుల్లో సర్కార్ విఫలమన్న బండి సంజయ్
- హిందూ పండుగలు, ఆలయాలపై ప్రభుత్వ చిన్నచూపు
- క్యూ లైన్లలో నీడ, తాగునీరు కరవవడంపై ఆగ్రహం
- సామాన్య భక్తుల కష్టాలు పట్టించుకోని నాయకులు
- ఆలయ నిధుల కోసం భవిష్యత్తులో పోరాటం

03

## భారత బ్యాడ్మింటన్‌కు దొరికిన కొత్త తార

- తైపీ ఓపెన్ టైటిల్‌ను కైవసం చేసుకున్న 17 ఏళ్ల తన్వి శర్మ
- తైపీ ఓపెన్ హిస్టరీలో యంగెస్ట్ ఛాంపియన్‌గా సంచలనం
- సూపర్-300 టోర్నమెంట్ ఫైనల్లో వియత్నాం షట్లర్‌పై ఘన విజయం

05



## కాంగ్రెస్సే అసలైన క్రిమినల్ వేస్ట్

### ఇంజనీర్లను 'క్రిమినల్ వేస్ట్' అన్న సీఎం వ్యాఖ్యలపై కేటీఆర్ నిలదీత



- విద్యార్థులు, గురువులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్
- ఇంజనీర్లు వేస్ట్ కాదు.. కాంగ్రెసే వేస్ట్
- 'బీరు బిర్యానీ బ్యాచ్' వ్యాఖ్యలపై మండిపాటు
- యువతను మోసం చేసిన వారికి మాట్లాడే నైతికత లేదు
- యువత ఆత్మగౌరవం దెబ్బతీస్తే భారీ మూల్యం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ఇంజనీర్లు, గురువులు ఎప్పటికీ క్రిమినల్ వేస్ట్ కారు కానీ, యువతను అడుగడుగునా నిలువునా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీయే అసలైన క్రిమినల్ వేస్ట్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ధ్వజమెత్తారు. ఇంజనీరింగ్ విద్యార్థులను, ఇంజనీర్లను సీఎం రేవంత్ రెడ్డి క్రిమినల్ వేస్ట్ అన్న కామెంట్స్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి కేటీఆర్ ఒక బహిరంగ లేఖ రాశారు. ఒకవైపు మన దేశ ఇంజనీర్లు ప్రపంచ ప్రముఖ కంపెనీలను విజయవంతంగా నడుపుతుంటే, అంతరిక్షంలోకి అధునాతన మిగతా 2లో..

## కార్పొరేషన్ల భర్తీకి కసరత్తు!

- ఈ నెలాఖరుకల్లా నామినేటెడ్ పోస్టుల భర్తీ
- జాప్యంపై రేవంత్ రెడ్డి అసంతృప్తితో త్వరపడిన యంత్రాంగం
- ఆశావహుల జాబితాల తయారీలో బిజీగా లీడర్లు
- పార్టీ కోసం కష్టపడిన అర్హులకే పదవులు
- సీనియర్లు, యువతకు తగిన ప్రాధాన్యం
- ఆశావహుల నుంచి ముమ్మర ప్రయత్నాలు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టులు అలాగే కార్పొరేషన్ల చైర్‌పర్సన్ల భర్తీ ప్రక్రియ వేగవంతం అయింది. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఏఐసీసీ పెద్దలు దీనికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గతంలో ఇచ్చిన గడువు ముగిసినా భర్తీ ఆలస్యం కావడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసంతృప్తి చెందారు. అర్హుల జాబితాను త్వరగా పంపాలని కోరుతున్నారు. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ఈ బాధ్యతను వేగంగా పూర్తి చేయాలని చూస్తున్నారు. ఈ నెలాఖరు కల్లా కీలకమైన పదవులను భర్తీ చేయాలని నిర్ణయించారు. పార్టీ కోసం కష్టపడిన నాయకులకు తగిన గుర్తింపు ఇవ్వాలని మిగతా 2లో..



## డ్రగ్స్ కోరల నుంచి యువతను రక్షించండి


- నవభారత నిర్మాణంలో మత్తుకు స్థానం లేదు
- 100 వారాల భారీ కార్యాచరణతో డ్రగ్స్ పై యుద్ధం
- డ్రగ్స్ రహిత భారత్ లక్ష్యంగా 'నషా ముక్త్ యువా'
- డ్రగ్స్ రహిత భారత్ కోసం ప్రధాని నరేంద్ర మోదీ సరికొత్త నిర్ణయం

02

## మహాకాళిని దర్శించుకున్న సీఎం రేవంత్

- లష్కర్ బోనాలలో పాల్గొన్న రేవంత్ రెడ్డి, మంత్రులు
- భక్తిశ్రద్ధలతో బోనం ఎత్తుకున్న మంత్రి కొండా సురేఖ
- కుటుంబ సమేతంగా దర్శించుకున్న టీపీసీసీ చీఫ్
- ఏర్పాట్లను చూసుకున్న ఎమ్మెల్యే తలసాని
- అధికారికంగా పట్టువస్త్రాల సమర్పణ
- పటిష్ట చర్యలు చేపట్టిన పోలీసులు

02



# మహాకాళిని దర్శించుకున్న సీఎం రేవంత్



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

సికింద్రాబాద్ నగరంలో ఘనంగా జరిగిన లష్కర్ బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచాయి. పండుగ సందర్భంగా ఆదివారం ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకోవడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా విచ్చేశారు. ఆయనతో పాటు మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క కూడా ఆలయానికి వచ్చారు. అలాగే పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు ఈ పవిత్ర కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. గద్దర్ తనయ వెన్నెల కూడా ముఖ్యమంత్రితో పాటు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ప్రముఖులకు నిర్వాహకులు సాంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు. మంగళవాయిద్యాలు, మేళతాళాల చప్పుళ్ల మధ్య నాయకులు గర్భగుడిలోకి ప్రవేశించారు. భక్తుల కోలాహలం మధ్య ఆలయ ప్రాంగణం అంతా ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రముఖులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేవాలయానికి వచ్చిన ప్రముఖులకు అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. వేదమంత్రాల నడుమ నాయకులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనం సమర్పించారు. తెలంగాణ ఆడబిడ్డల ఆచారాలకు అనుగుణంగా తలపై బోనం ఎత్తుకుని ఆమె నివాళులు అర్పించారు. రాష్ట్రం పాడి పంటలతో వర్ధిల్లాలని, ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలని అమ్మవారిని వేడుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సహా ఇతర మంత్రులు కూడా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నిత్యం ప్రజల సేవలో ఉండే తమకు అమ్మవారి ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలని కోరుకున్నారు. ఆలయ పండితులు వీరికి వేద ఆశీర్వచనాలు అందజేశారు. పూజా కార్యక్రమాలు ముగిసిన తర్వాత అర్చకులు అతిథులకు అమ్మవారి తీర్థప్రసాదాలను బహుకరించారు. భక్తుల రద్దడిని దృష్టిలో ఉంచుకుని పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ప్రముఖుల రాకతో ఆలయ పరిసరాలు జనసందోహంగా మారాయి. ఉజ్జయిని మహంకాళిని దర్శించుకున్న వారిలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కూడా ఉన్నారు. ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి వచ్చారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబం మొత్తం కలిసి భక్తితో అమ్మవారికి కానుకలు సమర్పించారు. పురాతన సంప్రదాయాలను పాటిస్తూ వారు తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు మహేష్ కుమార్ గౌడ్ కుటుంబానికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ వేడుకల్లో స్థానిక నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నగర అభివృద్ధికి అమ్మవారు శక్తిని ప్రసాదించాలని నాయకులు కోరారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్నీ తానై పర్యవేక్షించారు. భక్తులకు కల్పించిన సౌకర్యాలను నాయకులు పరిశీలించారు. పండుగ వాతావరణం నగరమంతా వ్యాపించింది. ఈ వేడుకల్లో భాగంగా మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కూడా పాలుపంచుకున్నారు. ఆయన ఆలయ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులతో కలిసి పనిచేశారు. ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ కూడా ఈ కార్యక్రమంలో క్రియాశీలకంగా వ్యవహరించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన జనాలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా స్వయంగా చూసుకున్నారు. అధికార ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. లష్కర్ బోనాలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తాయని నాయకులు పేర్కొన్నారు. ప్రతి ఏటా ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అమ్మవారి కటాక్షం రాష్ట్రంపై ఎప్పటికీ ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా ఈ పండుగను జరుపుకోవడం విశేషం. తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పేలా లష్కర్ బోనాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం అధికారికంగా ఈ పండుగకు అన్ని ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. క్యూలైన్లలో ఎలాంటి తోపులాట జరగకుండా వాలంటీర్లు సేవలు అందించారు. పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండి ట్రాఫిక్ నియంత్రణ చేశారు. పండుగ చివరి ఘట్టం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అమ్మవారి దివ్య ఆశీస్సులతో రాష్ట్రం మరింత ముందుకు వెళ్తుందని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలు విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో నూ ఇలాంటి వేడుకలు ఘనంగా జరుగుతాయని నమ్ముతున్నారు.

## ముఖ్యమంత్రిని కలిసిన జక్కిడి శివచరణ్ రెడ్డి

**లష్కర్ బోనాల ఉత్సవాల సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమం**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** లష్కర్ బోనాల ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి ముఖ్యమంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో యువత సంక్షేమం, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారానికి యువజన కాంగ్రెస్ చేపడుతున్న కార్యక్రమాలపై సంక్షిప్తంగా చర్చించినట్లు సమాచారం. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి జక్కిడి శివచరణ్ రెడ్డి బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.





## పింఛన్ లబ్ధిదారులు @ 50 లక్షలు!

**మొదటిపేజీ తరువాయి**

కేటగిరీల వారికీ అందించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఎన్నికల హామీల అమలు, సామాజిక న్యాయం పాటించాలని భావిస్తున్నారు. తొలిసారిగా నిర్వహించిన సమగ్ర కులగణన సంక్షేమ పథకాల లక్ష్య సాధనలో కీలక ఆధారంగా మారింది. గతంలో వివిధ కారణాలతో పింఛన్లకు దరఖాస్తు చేసుకోలేకపోయినవారు, అర్హత ఉన్నా జాబితాలో చేరనివారు, కొత్తగా అర్హత సాధించినవారి వివరాలు కులగణనలో నమోదయ్యాయి. ఇందులో సుమారు 10,35,000 మంది పింఛన్లకు అర్హులని ప్రభుత్వం గుర్తించింది. వీరిని కూడా జాబితాలో చేరిస్తే మొత్తం లబ్ధిదారుల సంఖ్య దాదాపు 51,40,000 కు చేరుకుంటుంది. ఈ ఖర్చు ప్రతి ఏటా సుమారు మూడు వేల నాలుగు వందల కోట్లకు చేరుకుంటుంది. దీనిద్వారా అర్హులందరికీ తగిన ఆర్థిక సహాయం దొరుకుతుంది. దేశంలోనే తొలి రాష్ట్రంగా తెలంగాణ ప్రభుత్వం తలసేమియా, సికిల్ సెల్ ఎనిమియా బాధితులకు ప్రతి నెలా పెన్షన్లు ఇచ్చే స్కీమ్‌ను అమలు చేస్తోంది. దేశంలోనే తొలిసారిగా దీనికి శ్రీకారం చుడుతున్నారు. రాష్ట్రంలో ఈ రెండు రకాల బాధితులు గరిష్ట స్థాయిలో 8,000 మంది ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు వీరి కోసం పనిచేస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం మొదటిసారిగా పింఛను సౌకర్యాన్ని అందిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అందుబాటులోకి తెచ్చిన వెబ్ పోర్టల్‌లో దేశవ్యాప్తంగా 4,361 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. తెలంగాణలో ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం పట్టణాల్లో డేకేర్ సెంటర్లను నడుపుతున్నారు. మంచిర్యాల, ఆసిఫాబాద్, కరీంనగర్ పట్టణాల్లోనూ బాధితులు ఉన్నట్లు తేలడంతో అక్కడ కూడా ఓపెన్ చేయనున్నారు. ఈ చర్యల వలన రోగులకు వైద్య సేవలతో పాటు ఆర్థిక భద్రత కూడా పూర్తిగా అందుబాటులోకి వస్తుంది. ప్రస్తుత జులై 2026 నాటికి గల లెక్కల ప్రకారం చూస్తే, వితంతు పింఛన్లు 14,74,411 మందికి ఇస్తున్నారు. ఒక్కొక్కరికి రెండు వేల పదిహేను రూపాయల చొప్పున మొత్తం రెండు వందల తొంభై ఏడు కోట్ల ఇరవై నాలుగు లక్షల రూపాయలు ఖర్చవుతోంది. వృద్ధాప్య పింఛన్లు 14,31,814 మందికి అందుతున్నాయి. ఒక్కొక్కరికి రెండు వేల పదిహేను రూపాయల చొప్పున రెండు వందల ఎనిమిది ఎనిమిది కోట్ల అరవై ఐదు లక్షల రూపాయలు ఇస్తున్నారు. దివ్యాంగులు 4,71,430 మంది ఉండగా ఒక్కొక్కరికి నాలుగు వేల పదిహేను రూపాయల చొప్పున నూట ఎనభై తొమ్మిది కోట్ల ముప్పై మూడు లక్షల రూపాయలు చెల్లిస్తున్నారు. ఒంటరి మహిళలు 1,38,106 మందికి, గీత కార్మికులు 59,611 మందికి, నేత కార్మికులు 33,887 మందికి ఈ సాయం అందుతోంది.

## కాంగ్రెస్సే అసలైన క్రిమినల్ వేస్ట్

**మొదటిపేజీ తరువాయి**



రాకెట్లను దూసుకెళ్లేలా ప్రయోగిస్తుంటే, అలాంటి గొప్పవారిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత చిన్నచూపు చూస్తూ క్రిమినల్ వేస్ట్ అని పిలుస్తున్నారు. దేశ ప్రగతికి ఎంతగానో పాటుపడుతూ లక్షల మందికి ఉపాధి అందిస్తున్న ఇంజనీర్లను సీఎం అగౌరవపరచడంపై వెంటనే స్పందించాల్సిన పూర్తి నైతిక, రాజకీయ బాధ్యత రాహుల్ గాంధీపై ఎంతైనా ఉన్నది. ఇలాంటి కీలకమైన అంశాలపై రాహుల్ గాంధీ మౌనంగా ఉండడం అంటే రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను పూర్తిగా సమర్థించినట్లే లెక్క. యువత రాబోయే రేపటి భారతదేశ నిర్మాతలు అన్న ప్రాథమిక విషయాన్ని రాహుల్ గాంధీ ఎట్టి పరిస్థితుల్లోనూ గుర్తుంచుకోవాలి. గతంలో ఇదే కాంగ్రెస్ పార్టీ యువతతో పెట్టుకుంటే ఎలాంటి భారీ మూల్యం చెల్లించుకుందో రాహుల్ గాంధీ ఒకసారి నెమరు వేసుకోవాలి. దేశంలోని యువత తలుచుకుంటే ఆ పార్టీ మెడలు ఎలా వంచుతారో కాంగ్రెస్ నాయకులు ఎప్పటికీ మర్చిపోకూడదు. రాహుల్ గాంధీ నిత్యం చెప్పే ఊకదంపుడు ప్రసంగాలకు పూర్తి భిన్నంగా, క్షేత్రస్థాయిలో తెలంగాణ యువత ఓట్లు అడిగి వారిని ఘోరంగా మభ్యపెట్టిన రాహుల్ గాంధీకి ఆయన నిజమైన నైతిక బాధ్యతను గుర్తు చేయడానికే ఈ లేఖను రాస్తున్నానని కేటీఆర్ స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, నైతికత, యువతకు దక్కాల్సిన సముచిత గౌరవం వంటి అంశాలపైన మాట్లాడే నైతిక అర్హత పూర్తిగా కోల్పోయారు. యువత గురించి రాహుల్ గాంధీ ఇచ్చే కబుర్లు, చెప్పే ఊకదంపుడు ప్రసంగాలకు భిన్నంగా రేవంత్ రెడ్డి విద్యార్థులను, ఇంజనీర్లను, టీచర్లను నేరుగా క్రిమినల్ వేస్ట్ అని సంబోధిస్తున్నారు. ఇప్పటిదాకా రాహుల్ గాంధీ రేవంత్ రెడ్డిని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆదేశించకపోవడం, ఆయన తరఫున స్వయంగా క్షమాపణ కోరకపోవడం చూస్తుంటే ఆ మాటలను బలపరుస్తున్నట్లే ఉంది. కేవలం మైకులు పట్టుకుని చేసే ప్రసంగాలతో మాత్రమే నాయకత్వం స్థాయి పెరగదని, కాంగ్రెస్ పార్టీ విధానాలతోనే చేసిన తప్పులను సరిదిద్దుకోవడంతోనే గౌరవం పెరుగుతుందని గుర్తించి రాహుల్ గాంధీ వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. తమ పార్టీకి చెందిన ముఖ్యమంత్రి చేసిన ఈ బరితెగించిన వ్యాఖ్యలకు విద్యార్థులకు, గురువులకు, ఇంజనీర్లకు రాహుల్ గాంధీ తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలి. కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి చేసిన ఈ వివాదాస్పద వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని రాహుల్ గాంధీ ఎప్పటికీ చెప్పలేరు. తెలంగాణ యువత మీ ముఖ్యమంత్రి చేస్తున్న ప్రతి అడ్డమైన వ్యాఖ్యను నిశితంగా గమనిస్తోంది, భవిష్యత్తు కోసం ఖచ్చితంగా గుర్తుంచుకుంటుంది. రేవంత్ రెడ్డి కేవలం ఇంజనీరింగ్ విద్యార్థులను మాత్రమే కాకుండా వారిని తీర్చిదిద్దే ఇంజనీరింగ్ టీచర్లను కూడా చాలా తప్పుగా మాట్లాడారు. రాష్ట్రంలోని యువతపైన, విద్యార్థులపైన అడ్డగోలుగా నోరు పారేసుకోవడం రేవంత్ రెడ్డికి ఓ అలవాటుగా మారిపోయింది. తెలంగాణ యువత ఆత్మగౌరవం పైన, వారి కష్టపడే ఆత్మవిశ్వాసం పైన రేవంత్ రెడ్డి ఎప్పుడూ నిరాదరణగా మాట్లాడుతుంటారన్నారు.

# కార్పొరేషన్ల భర్తీకి కసరత్తు!

**మొదటిపేజీ తరువాయి**

ముఖ్యమంత్రి అలాగే పీసీసీ చీఫ్ భావిస్తున్నారు. పాతవారికి రెన్యూవల్ చేయాలా లేక కొత్తవారికి అవకాశం కల్పించాలా అనేదానిపై స్పష్టత వస్తోంది. పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన వారి వివరాలను సేకరిస్తున్నారు. ఈ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని నాయకులు భావిస్తున్నారు. జిల్లాల వారీగా కసరత్తు జరుగుతోంది. ప్రతి జిల్లాలో నామినేటెడ్ పదవులను ఆశిస్తున్న నాయకుల జాబితాను తయారు చేస్తున్నారు. వారి ప్రొఫైల్స్ అలాగే పార్టీ కోసం వారు చేసిన సేవలను పరిశీలిస్తున్నారు. ఇన్‌చార్జ్ మంత్రులు ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేసి ఆశావహుల వివరాలను సేకరిస్తున్నారు. ఈ వివరాలతో కూడిన డ్రాఫ్ట్ జాబితాను త్వరగా పీసీసీకి అందజేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. పీసీసీ చీఫ్ అలాగే ముఖ్యమంత్రి ఇద్దరూ కలిసి ఈ జాబితాను పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటారు. ఇన్‌చార్జ్ మంత్రులు తమ జిల్లాల్లోని నాయకులతో త్వరగా భేటీలు ముగించాలని సూచనలు అందాయి. ఎవరికి ఏ పదవి ఇస్తే పార్టీకి ఉపయోగపడుతుందనే అంశంపై చర్చిస్తున్నారు. జిల్లాల నుంచి వచ్చే ముసాయిదా జాబితా ఆధారంగా తుది అంకం పూర్తి అవుతుంది. యువత అలాగే సీనియర్ నాయకుల మధ్య సమతుల్యత పాటిస్తూ ఈ జాబితాను రూపొందిస్తున్నారు. వివాదాలకు తావు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించే దిశగా పార్టీ అడుగులు వేస్తోంది. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ఈ పదవుల కేటాయింపు ఎంతగానో ఉపయోగపడుతుందని కాంగ్రెస్ పెద్దలు గట్టిగా నమ్ముతున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ విషయంలో ముందు వరుసలో నిలిచారు. ఆయన తన శాఖ పరిధిలోని నామినేటెడ్ పోస్టుల భర్తీపై దృష్టి పెట్టారు. శనివారం గాంధీభవన్‌కు వెళ్లి పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌తో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఏయే శాఖల్లో ఏ పదవులు ఖాళీగా ఉన్నాయి అలాగే వాటికి ఎవరు అర్హులు అనే విషయాలపై చర్చించారు. ఆసక్తి ఉన్న నాయకుల వివరాలను పీసీసీ చీఫ్‌కు అందజేశారు. పార్టీ కోసం ఆ నాయకులు చేసిన కృషిని మంత్రి వివరించారు. ఈ భేటీ ముగిసిన తర్వాత మంత్రి మీడియాతో మాట్లాడారు. తన శాఖ పరిధిలోని పోస్టుల జాబితాను పీసీసీ చీఫ్‌కు ఇచ్చినట్లు ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రితో చర్చించిన తర్వాత ఈ పేర్లు అన్నీ ఖరారు అవుతాయని ఆయన మీడియాకు వెల్లడించారు. మిగతా మంత్రులు కూడా త్వరలోనే తమ శాఖల జాబితాలను అందించనున్నారు. ఈ భేటీతో నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ వేగం పుంజుకుంది. నాయకుల్లో ఉత్సాహం పెరిగింది. నామినేటెడ్ పదవుల భర్తీలో ఎలాంటి జాప్యం జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళిక రూపొందించింది. నిర్దిష్టమైన షెడ్యూల్ ప్రకారం పనులు జరిగేలా చూస్తున్నారు. అర్హులైన నాయకులకు తగిన పదవులు దక్కేలా చేయడం ద్వారా ప్రభుత్వానికి అలాగే పార్టీకి మంచి పేరు వస్తుందని భావిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ వ్యవసాయ కార్పొరేషన్లు అలాగే ఇతర సంస్థల నియామకాలపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. పార్టీ శ్రేణుల్లో జోష్ నింపేందుకు ఈ పదవుల భర్తీ కీలకమని నాయకులు భావిస్తున్నారు. త్వరలోనే తుది జాబితా బయటకు వచ్చే అవకాశం ఉంది. ఆశావహులు తమ ప్రయత్నాలను మరింత ముమ్మరం చేశారు. గాంధీభవన్‌లో సందడి వాతావరణం నెలకొంది. లీడర్లు అందరూ తమ ప్రొఫైల్స్‌ను సంబంధిత మంత్రులకు సమర్పిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈ నియామకాలు పూర్తి రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకోనున్నాయి. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ అర్హులకే పీఠం వేయాలని పార్టీ అధిష్టానం గట్టిగా నిర్ణయించుకుంది. ఈ నిర్ణయాలన్నీ యువతకు అలాగే జనరేషన్‌కి త్వరగా అర్థమయ్యేలా స్పష్టంగా అమలు చేస్తున్నారు. సోషల్ మీడియాలో కూడా ఈ అంశాలపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. డిజిటల్ యుగంలో ప్రతి నాయకుడి పనితీరును ఆన్‌లైన్ ద్వారా బేరీజు వేస్తున్నారు. ఏ ప్రాంతంలో ఏ నాయకుడు ఎంత బలంగా ఉన్నారు అనే డేటాను పార్టీ సేకరిస్తోంది. పాత తరం అనుభవం అలాగే కొత్త తరం జోరు రెండింటిని సమన్వయం చేస్తూ పదవుల కేటాయింపు సాగుతోంది. త్వరలో కొలువుదీరే కార్పొరేషన్ల చైర్మన్లు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు అవుతారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలను చేరువ చేయడంలో ఈ సంస్థల పాత్ర చాలా కీలకం కానుంది. నియామకాలు పూర్తి కాగానే అధికారిక ప్రకటన వెలువడుతుంది. దీనికోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా ఈ పదవుల భర్తీ ఉంటుందని పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. పాలనా పరంగా కూడా వేగం పెంచేందుకు ఈ నామినేటెడ్ పోస్టులు ఎంతగానో సహకరిస్తాయని అందరూ భావిస్తున్నారు.






## డయల్100 ఫిర్యాదును నిర్లక్ష్యం చేసిన హెడ్ కానిస్టేబుల్ సస్పెండ్

**ప్రమాద బాధితుడికి స్పందించకపోవడంపై సీపీ డా. ఎం. రమేష్ చర్య**

**సైబరాబాద్,విశాల భారతి:** అత్యవసర సేవ అయిన డయల్ 100కు వచ్చిన ఫిర్యాదును నిర్లక్ష్యం చేసిన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సయ్యద్ యూనస్ (హెచ్‌సీ661)ను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ సస్పెండ్ చేశారు. ఆగస్టు 1 అర్ధరాత్రి గచ్చిబౌలి ఐకియా సమీపంలో రెండు కార్లు ఢీకొన్న ఘటన అనంతరం బాధితుడు రెండు సార్లు డయల్ 100కు ఫోన్ చేసి పోలీసుల సహాయం కోరినట్లు అధికారులు తెలిపారు. అయితే విధుల్లో ఇన్‌చార్జిగా ఉన్న హెడ్ కానిస్టేబుల్ సయ్యద్ యూనస్ సంఘటనా స్థలానికి వెళ్లకుండా, "కాలర్ వల్ల ఇబ్బంది" అనే కారణంతో రెండు ఫిర్యాదులను ఎలాంటి చర్యలు తీసుకోకుండా మూసివేసినట్లు విచారణలో వెల్లడైంది. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన పోలీసు ఉన్నతాధికారులు శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. విచారణ పూర్తయ్యే వరకు సయ్యద్ యూనస్‌ను సస్పెండ్ చేస్తూ సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజలకు అత్యవసర సేవల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్నీ సహించబోమని, విధుల్లో అలసత్వం ప్రదర్శించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు స్పష్టం చేశారు.

## డ్రగ్స్ కోరల నుంచి యువతను రక్షించండి

**న్యూఢిల్లీ :** వికసిత్ భారత స్వప్నాన్ని సాకారం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్న మన దేశానికి అసలైన బలం, సంపద మన యువతే! అలాంటి నవభారత నిర్మాతలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటంతో పాటు ఎలాంటి దురలవాట్లకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉన్నప్పుడే దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుంది. ఈ ఉద్దేశంతోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్ నషా ముక్త్ యువా' జాతీయ ప్రచారాన్ని ఆదివారం వర్చువల్ విధానంలో అత్యంత వైభవంగా ప్రారంభించారు. దేశాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు ప్రతీ ఒక్కరూ నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ భారీ ప్రచారాన్ని ప్రారంభించిన అనంతరం ప్రధాని మోదీ ప్రసంగిస్తూ.. మత్తు పదార్థాల రహిత భారత్ కోసం చేపడుతున్న ఈ ఉద్యమం కేవలం ఒక వ్యక్తికి, కుటుంబానికి లేదా రాత్రికి రాత్రే అయిపోయే దానికి పరిమితం కాదని వ్యాఖ్యానించారు. ఇది సమాజ బాధ్యతతో పాటు ప్రతిష్టాత్మక దేశ శ్రేయస్సుకు సంబంధించిన మహత్తరమైన కార్యం అని స్పష్టం చేశారు. మన యువత ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని, డ్రగ్స్ ఎంతటి ప్రమాదకరమో గ్రహించి దానికి ఎల్లప్పుడూ దూరంగా ఉండేలా అవగాహన పెంచుకోవాలని కోరారు. ఏదైనా ఒక కఠినమైన పనిని ఒక వ్యక్తి ఒంటరిగా చేపట్టడానికి ప్రయత్నిస్తే అలసట, నిరాశ ఎదురయ్యే అవకాశం ఉందన్న ప్రధాని, అదే పనిని కోట్లాది మంది భాగస్వామ్యంతో ఒక ప్రజా ఉద్యమంగా చేపడితే అపారమైన శక్తి ఉత్పన్నమవుతుందని చెప్పారు.

# కాంగ్రెసోళ్లది మిడిమిడి జ్ఞానం


**మొదటిపేజీ తరువాయి**




రైతన్నల నోట్లో మట్టి కొడుతున్నారంటూ వారు తమ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో అత్యంత కీలకమైన భాగమైన గాయత్రి పంపు హౌజ్‌ను మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఎమ్మెల్సీ ఎల్ రమణ అందరూ కలిసి నేరుగా పరిశర్శించారు. అనంతర కాలంలో వారందరూ స్థానిక విలేకరులతో మాట్లాడారు. నీళ్లపై పూర్తి అవగాహన ఉన్నవారితో మాత్రమే ఎవరైనా చర్చలు జరపవచ్చునని స్పష్టం చేశారు. ఏమీ తెలియని వారికి వివరించడం సాధ్యమవుతుందని చెప్పారు. కానీ మిడిమిడి జ్ఞానంతో మాత్రమే మాట్లాడే కాంగ్రెస్ నాయకులతో తాము ఎట్టి పరిస్థితుల్లోనూ మాట్లాడలేమని వారు తేల్చి చెప్పారు. నీటి పారుదల రంగానికి సంబంధించి ఏ బేసిన్‌లో ఏ ప్రాజెక్టు ఉందనే కనీస జ్ఞానం కూడా కాంగ్రెస్ నాయకులకు లేదని వినోద్ కుమార్ ఎద్దేవా చేశారు. ఏ ప్రాజెక్టు నుంచి నీళ్లను ఎక్కడికి తరలిస్తారో కూడా ఆ పార్టీ నేతలకు అస్సలు తెలియదని ఆయన విమర్శించారు. కాళేశ్వరం అంటే కేవలం మేడిగడ్డ ఒక్కటే కాదనే విషయాన్ని తాము ఎన్నిసార్లు చెప్పినా వీళ్లకు అసలు అర్థం కావడం లేదని అన్నారు. కాంగ్రెస్ నేతలందరికీ ప్రాజెక్టులపై అలాగే నీళ్లపై పక్కాగా అవగాహన తరగతులు నిర్వహించాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్‌కు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రికి, మంత్రులకు నీళ్లపై కనీస అవగాహన లేదని మరో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. ఎల్లంపల్లి నుండి మిడ్ మానేరుకు గ్రావిటీ ద్వారా నీళ్లొస్తున్నాయని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సోయి లేకుండా మాట్లాడడం చాలా హాస్యాస్పదంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. ఈ విషయాలను ప్రజలందరూ గమనించాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని అంతర్భాగమైన నంది అలాగే గాయత్రి పంప్ హౌస్‌ల ద్వారానే ఎల్లంపల్లి నుండి మిడ్ మానేరుకు నీళ్లు తరలిస్తారనే నిజం ఈ తెలివిలేని అడ్లూరికి తెలియజెప్పడానికే తాము ఈ యాత్ర చేపట్టామని కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు. గోదావరి ప్రాజెక్టులపై కాంగ్రెస్ నేతలు ఎలాంటి సోయి లేకుండా మాట్లాడుతున్నారని మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సముద్ర మట్టానికి ఎగువన ఉన్న ప్రాంతాలన్నింటికీ సాగునీరు అందించడానికే గతంలో బాహుబలి మోటార్లు పెట్టారనే కనీస జ్ఞానం కూడా ఆ మంత్రికి లేదని ఆయన విమర్శించారు. కేసీఆర్ గారిపై ఉన్న రాజకీయ కక్షతో కాళేశ్వరం ప్రాజెక్టును పడావు పెట్టకుండా పూర్తిస్థాయిలో పంపులను ఆన్ చేసి ప్రాజెక్టులన్నీ తక్షణమే నింపాలని ఆయన డిమాండ్ చేశారు. లేనియెడల ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని గంగుల కమలాకర్ హెచ్చరించారు. నీళ్లపై అలాగే ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు చేస్తున్న తెలివితక్కువ మాటలు విని ప్రజలంతా నవ్వుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. మంత్రులకు ఎల్లంపల్లి నుండి మిడ్ మానేరుకు నీళ్లు ఎలా వస్తాయో కూడా తెల్వదని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మేడారానికి అలాగే మేడిగడ్డకు మధ్య తేడా కూడా అస్సలు తెల్వదని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టును పూర్తిగా పూర్తి చేసి లక్షలాది ఎకరాలకు సాగు నీరందించిందే బీఆర్ఎస్ ప్రభుత్వం అనే సోయి కూడా ప్రస్తుత పాలకులకు లేకుండా పోయిందని విమర్శించారు. కనీస స్పందన లేకుండా మాట్లాడే నాయకులకు ప్రజలే త్వరలో తగిన బుద్ధి చెబుతారని సుంకె రవిశంకర్ స్పష్టం చేశారు. ప్రాజెక్టుల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. రైతుల సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేశారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన నంది అలాగే గాయత్రి పంప్ హౌస్‌ల ద్వారా ఎల్లంపల్లి నుండి మిడ్ మానేరుకు నీళ్లు తరలిస్తారనే కనీస సోయి కూడా ఈ కాంగ్రెస్ నాయకులకు లేదని ఎమ్మెల్సీ ఎల్ రమణ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న ఈ కరువు పరిస్థితులలో పూర్తిస్థాయిలో కాళేశ్వరం మోటార్లు ఆన్ చేసి గోదావరి జలాలను సద్వినియోగం చేసుకునే వరకు కేసీఆర్ నాయకత్వంలో ఈ కాంగ్రెస్ ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

## శంషాబాద్‌లో ఘనంగా బోనాల వేడుకలు

**అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**



**రాజేంద్రనగర్, విశాల భారతి :** తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకమైన ఆషాఢ బోనాల పండుగ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శంషాబాద్ సర్కిల్ పరిధి అంతటా భక్తి, ఉత్సాహాల నడుమ పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ పలు అమ్మవారి దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి దేవాలయాల పర్యటన ప్రారంభించిన ఎమ్మెల్యే, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. పూజలు, బోనాలు, సంప్రదాయ కార్యక్రమాలతో శంషాబాద్ ప్రాంతం భక్తి మయంగా మారింది. పండుగ సందర్భంగా దేవాలయాల వద్ద ప్రత్యేక అలంకరణలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తుల రద్దీ దృష్ట్యా పోలీసులు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసి శాంతి భద్రతలను పర్యవేక్షించారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారు.

# పటాన్‌చెరుపై ఎస్ఐఆర్ దెబ్బ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలో రాబోయే రాజకీయ పరిణామాలు ఇప్పుడు సర్వత్ర చర్చనీయాంశంగా మారాయి. స్థానిక నాయకులకు ఎస్ఐఆర్ ప్రక్రియ రూపంలో కొత్త తలనొప్పులు వచ్చి పడ్డాయి. డిజిటలైజేషన్ ప్రక్రియకు పట్టణ ప్రాంత ఓటర్లు ఆశించిన స్థాయిలో ఆసక్తి చూపడం లేదు. దీంతో దాదాపు లక్షన్నర ఓట్లు కోల్పోయే ప్రమాదం పొంచి ఉందని రాజకీయ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. సాధారణ ఎన్నికల మాదిరిగానే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఈ ప్రక్రియ కోసం తీవ్రంగా శ్రమిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నా ఓటర్ల నుంచి తగిన స్పందన రావడం లేదు. ఈ ప్రత్యేక సవరణ కారణంగా నియోజకవర్గంలో జరగబోయే రాజకీయ మార్పులపై ప్రధాన పార్టీల నేతల్లో గుబులు మొదలైంది. ఓటర్ల జాబితా ప్రక్షాళన పార్టీల తలరాతను మార్చేలా కనిపిస్తోంది. పటాన్‌చెరు ప్రాంతం దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉన్న అతిపెద్ద పారిశ్రామిక కేంద్రంగా వెలుగొందుతోంది. ఇక్కడి ఓటర్ల సరళి ఇతర ప్రాంతాల కంటే చాలా భిన్నంగా ఉంటుంది. ఫార్మా మరియు మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల కారణంగా బిహార్, యూపీ, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ లాంటి ఉత్తరాది రాష్ట్రాల నుంచి లక్షలాది కార్మికులు ఇక్కడ స్థిరపడ్డారు. భవన నిర్మాణ రంగంలోనూ వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వేలాది కుటుంబాలు సైతం ఇక్కడ నివాసం ఉంటున్నాయి. పటాన్‌చెరులో గెలుపోటములను శాసించేది ఇతర రాష్ట్రాల వారే కావడం గమనార్హం. అయితే ఈ కుటుంబాలు స్థానికంగా ఓటు హక్కు కలిగి ఉండటంతో పాటు తమ స్వస్థలాల్లోనూ ఓట్లు కలిగి ఉన్నాయి. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఒకే చోట ఓటు ఉంచుకోవాలి. దీంతో మెజారిటీ కార్మికులు సొంతూళ్లలోనే ఓట్లు ఉంచుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. భారీగా ఓట్ల తొలగింపు జరిగే అవకాశం ఉంది. ప్రధాన పార్టీల ఆందోళనకు తగినట్టుగానే ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఎస్ఐఆర్ ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు కేవలం అరవై నాలుగు శాతం మాత్రమే పూర్తయింది. ఈ సెగ్మెంట్‌లో నాలుగు లక్షల ఇరవై ఎనిమిది వేల ఓటర్లు ఉండగా ఇప్పటివరకు రెండు లక్షల డెబ్బై ఎనిమిది వేల వివరాలు మాత్రమే నమోదయ్యాయి. అంటే ఇంకా లక్షన్నర మందికిపైగా డిజిటలైజేషన్ ప్రక్రియకు ముందుకు రాలేదు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ పరిధిలోని పటాన్‌చెరు, అమీన్‌పూర్, ఆర్సీపురం మండలాల్లో ఎన్యూమరేషన్ చాలా తక్కువగా జరుగుతోంది. గ్రామీణ మండలాలైన జిన్నారం, గుమ్మడిదలలో మాత్రమే కొంత మెరుగ్గా పూర్తయింది. గడువు దగ్గర పడుతున్నా పట్టణ ఓటర్లు పెద్దగా పట్టించుకోవడం లేదు. డిజిటలైజేషన్ మందకొడిగా సాగుతుండటంతో ప్రధాన పార్టీల నాయకుల్లో ఆశలు క్రమంగా సన్నగిల్లుతున్నాయి. మరోవైపు సంగారెడ్డి జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఇప్పటివరకు డెబ్బై ఎనిమిది శాతానికి పైగా డిజిటలైజేషన్ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా పద్నాలుగు లక్షల మందికి పైగా ఓటర్ల వివరాలు ఆన్‌లైన్ చేశారు. జిల్లాలో అత్యధికంగా నారాయణఖేడ్‌లో శాతం నమోదు కాగా, ఆఖరి స్థానంలో పటాన్‌చెరు నియోజకవర్గం నిలిచింది. ఈ వెనుకబాటుతనంపై పార్టీల అధిహారాలు తీవ్రంగా దృష్టి పెట్టాయి. కాంగ్రెస్ మరియు బీఆర్ఎస్ పార్టీల ముఖ్య నాయకులు కార్యకర్తలకు బూత్ స్థాయి అధికారుల బాధ్యతలపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. అయినా సరే ప్రక్రియ సవ్యంగా సాగకపోవడంతో నాయకులు ఆందోళన చెందుతున్నారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తన ఫోటోతో ప్రత్యేక ప్రచార రథాలను సిద్ధం చేసి మరీ ప్రచారం చేస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్ సైతం ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. పట్టణ ప్రాంతంగా ఉన్న పటాన్‌చెరులో బూత్ స్థాయి విధులు నిర్వహించడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే లక్షన్నర ఓట్లు గల్లంతయ్యే దుస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. రాబోయే స్థానిక మరియు సార్వత్రిక ఎన్నికల్లో పైచేయి సాధించాలంటే ఈ సవరణ ప్రక్రియను బలమైన పునాదిగా మార్చుకోవాలి. నియోజకవర్గ ముఖ్య నేతల నుంచి కిందిస్థాయి కార్యకర్తల వరకు అందరూ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. గడువు పొడిగింపు నేపథ్యంలో పట్టున్న ప్రాంతాల్లో డిజిటలైజేషన్ పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. ఓటర్లు భారీగా తగ్గితే ఎన్నికల ప్రణాళికలు పూర్తిగా బెడిసికొట్టే ప్రమాదం ఉంది. సాంప్రదాయ ఓటు బ్యాంక్ కుప్పకూలిపోతే ఫలితాలు తలకిందులవుతాయని నేతలు భావిస్తున్నారు. ఈ ప్రక్రియను నిర్లక్ష్యం చేస్తే ప్రత్యర్థులకు లాభం చేకూరుతుందని ఆందోళన చెందుతున్నారు. ఈ సవరణ ప్రక్రియ ద్వారా బలాన్ని పెంచుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర నష్టం జరుగుతుందని నాయకులు అంచనా వేస్తున్నారు. దీంతో మిగతా అన్ని కార్యక్రమాలను పక్కనపెట్టి ఎస్ఐఆర్ చుట్టూనే పటాన్‌చెరు రాజకీయాలు తిరుగుతున్నాయి. ప్రతి ఇంటికి తిరిగి ఓటర్లను ఒప్పించే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. అధికారులతో సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గంలో లక్ష్యాలను సాధించడానికి శ్రేణులు శ్రమిస్తున్నాయి. ఓటర్ల తొలగింపు నివారణే ధ్యేయంగా అడుగులు వేస్తున్నారు. ఏ చిన్న పొరపాటు జరిగినా ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరికలు జారీ అవుతున్నాయి. ప్రజాప్రతినిధులు సైతం తమ వ్యక్తిగత పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నిరంతరం శ్రమిస్తున్నారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన తుది ఫలితాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందో వేచి చూడాలి.






# రేవంత్‌ను ఎదురించాల్సిందే

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఏర్పాట్లలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రంగా విమర్శించారు. భక్తులకు కనీస వసతులు కల్పించడంలో అధికార యంత్రాంగం దారుణంగా విఫలమైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఎండకు ఎండిపోతూ వర్షానికి తడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. సామాన్య ప్రజలు క్యూలైన్లలో తీవ్ర ఇబ్బందులు పడుతుంటే పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ పెద్దలు తమ పర్యటనలకే పరిమితమై భక్తుల కష్టాలను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ ఆలయాల పట్ల ఈ ప్రభుత్వం చూపుతున్న వైఖరి వివక్ష పూరితంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. రంజాన్ పండుగ నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా రూ.33 కోట్లు విడుదల చేసిందని బండి సంజయ్ గుర్తు చేశారు. కానీ అత్యంత వైభవంగా నిర్వహించే బోనాల పండుగకు కనీసం రూ.20 కోట్లు కూడా కేటాయించలేదని ఆయన విమర్శించారు. హైదరాబాద్ నగరంలో ఉన్న ప్రతిష్టాత్మక ఆలయాలకు ప్రభుత్వం నుంచి ఒక్కో దానికి కనీసం రూ.6 వేలు కూడా దక్కలేదని ఆరోపించారు. రాష్ట్రంలో 80 శాతం పైగా ఉన్న హిందువులకు జనాభా ప్రాతిపదికన అదే స్థాయిలో నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. పండుగల నిర్వహణ విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ ద్వంద్వ వైఖరిని భక్తులు తీవ్రంగా గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ కూడా వ్యవహరిస్తోందని విమర్శించారు. హిందూ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బోనాల జాతర నిర్వహణలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం ప్రదర్శించడం సరికాదని బండి సంజయ్ హితవు పలకేశారు. రాష్ట్రంలో ఏ పండుగ వచ్చినా ప్రభుత్వం తరపున తగిన ఆర్థిక సహాయం అందించాలని ఆయన సూచించారు. అయితే కేవలం కొన్ని వర్గాల సంక్షేమం కోసమే పాకులాడే ఈ ప్రభుత్వం హిందూ పండుగలను చిన్నచూపు చూస్తోందని ఆయన ఆరోపించారు. గత ప్రభుత్వ పాలనలోనూ ఆలయాలకు నిధుల కేటాయింపులో తీవ్ర అన్యాయం జరిగిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇప్పుడు కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తూ భక్తుల మనోభావాలను దెబ్బతీస్తోందని ఆయన విమర్శించారు. ప్రభుత్వాల మారినప్పటికీ హిందూ దేవాలయాల పట్ల పాలకులు అనుసరిస్తున్న చిన్నచూపు మాత్రం మారడం లేదని బండి సంజయ్ మండిపడ్డారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందుచూపుతో ఏర్పాట్లు చేయడంలో ఘోరంగా విఫలమైందని బండి సంజయ్ పునరుద్ఘాటించారు. జాతరకు వచ్చే లక్షలాది మంది మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు పడుతున్న వేదన వర్ణనాతీతమని ఆయన అన్నారు. తాగునీటి సౌకర్యం లేక, కనీసం నీడ కరువై భక్తులు అల్లాడిపోతున్న దృశ్యాలు ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతున్నాయని విమర్శించారు. ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చే రాజకీయ నాయకులు కేవలం తమ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుని వెళ్లిపోతున్నారని చెప్పారు. సామాన్య భక్తుల గురించి ఆలోచించే తీరిక కూడా నేతలకూ అధికారులకూ లేకుండా పోయిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పవిత్రమైన బోనాల పండుగను కూడా రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటూ భక్తులను మోసం చేస్తున్నారని బండి సంజయ్ ఘాటుగా విమర్శించారు.

## కష్టకాలంలో అండగా ఎమ్మెల్యే గాంధీ

**నాలా ప్రమాద బాధిత బాలయ్య కుటుంబానికి రూ.2 లక్షల సాయం**



**శేరిలింగంపల్లి విశాల భారతి:** వైశాలి నగర్ సమీపంలోని రైల్వే అండర్‌పాస్ వద్ద ఇటీవల జరిగిన ప్రమాదంలో నాలాలో గల్లంతైన ప్రేమ్‌నగర్ బీ బ్లాక్‌కు చెందిన బాలయ్య (70) కుటుంబాన్ని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఆదివారం పరామర్శించారు. కొండాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్‌తో కలిసి బాధిత కుటుంబ సభ్యులను వారి నివాసంలో కలిసి ఓదార్చారు. ఈ సందర్భంగా కుటుంబానికి తక్షణ ఉపశమనంగా రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున అవసరమైన అన్ని విధాల సహకారం అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ హామీ ఇచ్చారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబానికి ప్రజాప్రతినిధులు, అధికారులు అండగా ఉంటారని భరోసా కల్పించారు.కార్యక్రమంలో జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి, డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్, తహసీల్దార్ మహిపాల్ రెడ్డి తదితర అధికారులు పాల్గొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, అవసరమైన ప్రభుత్వ సహాయం అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.తమ కష్టసమయంలో పరామర్శించి ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో పాటు అండగా నిలిచిన అధికారులు, ప్రజాప్రతినిధులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

# మెజారిటీ ఇస్తేనే పోటీ



**మొదటిపేజీ తరువాయి**

ఆయన ఎమోషనల్ అయ్యారు. నిరంతరం ప్రజల సంక్షేమం నల్లగొండ అభివృద్ధి మాత్రమే తన ధ్యేయంగా పనిచేస్తున్నానని వెల్లడించారు. నల్లగొండ నియోజకవర్గ అభివృద్ధి సాగునీరు విద్యుత్ నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగ మార్గ పనులను త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. నల్లగొండ జిల్లాలో రెండు పంటలకు పూర్తి స్థాయిలో సాగునీరు అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎస్ఎల్బీసీ ద్వారా జిల్లాను సస్యశ్యామల ధాన్య భాండాగారంగా మార్చడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తామన్నారు. ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరానికి సాగునీరు అందించి రైతుల కష్టాలను తీరుస్తామని ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు. కంచనపల్లి గ్రామాన్ని రాష్ట్రంలోనే ఒక ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని ఆయన ప్రకటించారు. రైతులకు గ్రామీణులకు ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు కీలక నిర్ణయం తీసుకున్నారు. మూడు కోట్ల రూపాయల భారీ వ్యయంతో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేస్తున్నట్లు సభలో వెల్లడించారు. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో ముందుకు వెళ్తున్నామన్నారు. దోమలపల్లిలో అత్యాధునిక హంగులతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. నన్ను ఈ స్థాయికి తీసుకువచ్చింది నల్లగొండ నియోజకవర్గ ప్రజలేనని ఆయన గుర్తు చేసుకున్నారు. వారి రుణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేనని మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే మూడు సంవత్సరాలు పూర్తిగా నల్లగొండ నియోజకవర్గ అభివృద్ధిపైనే తన ప్రత్యేక దృష్టి ఉంటుందని ఆయన చెప్పారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండేందుకు వారానికి రెండు రోజులు నియోజకవర్గంలోనే గడుపుతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు స్థానిక రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. నియోజకవర్గ ప్రజల మద్దతు ఉంటేనే రాజకీయాల్లో కొనసాగుతాననే సంకేతాలు పంపడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అభివృద్ధి ఎజెండాగా ముందుకు సాగుతున్న ఆయన చేసిన ప్రతి ప్రకటన ప్రజల్లో చర్చకు దారితీసింది. గతంలో చేసిన అభివృద్ధి పనులే తనను గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేయడం విశేషం. ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే తన ముందున్న కర్తవ్యమని ఆయన పునరుద్ఘాటించారు. ఎన్నికల రాజకీయాల పట్ల ఆయన వ్యక్తీకరించిన అభిప్రాయాలు కార్యకర్తల్లో ఆలోచన రేకెత్తించాయి. ప్రజల సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్న నాయకుడిగా ఆయన తన ప్రసంగంలో స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు తనకు ఎప్పటికీ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. నల్లగొండ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలపడమే తన జీవితాశయమని మంత్రి వెల్లడించారు. తాగు సాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా తగిన చర్యలు తీసుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తానని ఆయన పునరుద్ఘాటించారు. అభివృద్ధి సంక్షేమం జోడెడ్ల బండిలా ముందుకు సాగుతాయని ఆయన చెప్పారు. మంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో కూడా వైరల్ అయ్యాయి. ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి ఆయన సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే కాలంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తామని ఆయన స్పష్టం చేశారు. నల్లగొండ సమగ్ర అభివృద్ధికి అందరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సభ విజయవంతం కావడంతో నాయకులు కార్యకర్తలు ఉత్సాహం ప్రదర్శించారు.



## చిట్టీల మాయలో రూ.5 కోట్ల మోసం

**దంపతులు పరార్...**
**బుద్వేల్‌లో బాధితుల ఆందోళన**



**రాజేంద్రనగర్, విశాల భారతి :** రాజేంద్రనగర్ పరిధిలోని బుద్వేల్‌లో చిట్టీల పేరుతో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. సుమారు రూ.5 కోట్ల మేర ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి ఓ దంపతులు పరారైనట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. స్థానికుల వివరాల ప్రకారం, అశోక్ అనే వ్యక్తి చిట్టీల వ్యాపారం పేరుతో పలువురు నిరపరాధ ప్రజల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసినట్లు తెలుస్తోంది. ప్రారంభంలో నమ్మకం కలిగించే విధంగా వ్యవహరించిన అతను, తర్వాత పెద్ద మొత్తంలో నగదు సేకరించి రాత్రికి రాత్రే ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా పరారైనట్లు బాధితులు చెబుతున్నారు. ఈ ఘటనతో ఒక్కసారిగా షాక్‌కు గురైన బాధితులు తమ కష్టపడి సంపాదించిన డబ్బులు కోల్పోయామని వాపోతున్నారు. విషయం తెలిసిన వెంటనే పలువురు బాధితులు బుద్వేల్‌లోని అశోక్ నివాసం ముందు చేరుకుని ధర్నా నిర్వహించారు. తమ డబ్బులు తిరిగి ఇప్పించాలని, ఈ మోసం వెనుక ఉన్న వారందరినీ గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు పోలీసులను కోరుతున్నారు. పోలీసులు ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం. ఇలాంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఆర్థిక కార్యకలాపాల్లో పెట్టుబడులు పెట్టే ముందు పూర్తి వివరాలు తెలుసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ డివిజన్ పరిధిలోని కేవీఎస్ఆర్ లేఅవుట్‌లో ఇటీవల నిర్మించిన తారు రహదారి నెల రోజుల్లోనే దెబ్బతినడంపై టీఆర్ఎస్ ఇన్‌ఛార్జి వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యతా ప్రమాణాలను విస్మరించి రోడ్డు నిర్మాణం చేపట్టడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని ఆరోపించారు.జూన్ 29న నిర్మించిన రహదారి జులై 31 నాటికే పలు చోట్ల గుంతలు ఏర్పడి దెబ్బతినడం పనుల నాణ్యతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ప్రజల పన్నుల రూపంలో ఖర్చు చేస్తున్న ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నా సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.



నెల క్రితం నాసిరకంతో వేసిన రోడ్డు

# నెలకే రోడ్డు చిందరవందర..

# ప్రజాధనం వృథా!

- కేసీఆర్ లేఅవుట్‌లో నాసిరకం పనులపై టీఆర్ఎస్ ఆగ్రహం
- కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



నెల రోజులకే తేలికపాటి వర్షా లకు గుంతల మయంగా మారిన రోడ్డు



టిఆర్ఎస్ శేరిలింగంపల్లి ఇంచార్జ్ వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్.

**శేరిలింగంపల్లి - విశాల భారతి**

పనులు పూర్తయిన వెంటనే నాణ్యతను పరిశీలించి ధ్రువీకరించాల్సిన అధికారులు తమ బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమయ్యారని ఆరోపించారు.ఈ ఘటనపై స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ వెంటనే స్పందించి పూర్తి స్థాయి విచారణకు ఆదేశాలు ఇవ్వాలని వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ కోరారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా రహదారి నిర్మించిన కాంట్రాక్టర్‌తోనే అదనపు ప్రజాధనం ఖర్చు చేయకుండా రోడ్డును తిరిగి నిర్మింపజేయాలని డిమాండ్ చేశారు. అలాగే నిర్లక్ష్యం వహించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, కాంట్రాక్టర్ లైసెన్స్‌ను రద్దు చేసి బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాలని కోరారు.నాసిరకం పనులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకున్నప్పుడే ప్రభుత్వ పనుల్లో నాణ్యత పెరుగుతుందని, ప్రజాధనం దుర్వినియోగానికి అడ్డుకట్ట పడుతుందని ఆయన స్పష్టం చేశారు. స్థానిక ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ఈ అంశాన్ని ప్రభుత్వం, సంబంధిత అధికారులు అత్యవసరంగా పరిగణించి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# బోనాల వేడుకల్లో బీజేపీ నేత తోకల శ్రీనివాస్ రెడ్డి

**రాజేంద్రనగర్‌లో అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు – ప్రజలకు శుభాకాంక్షలు**

**రాజేంద్రనగర్:విశాల భారతి :**

బోనాల పండుగ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని జీహెచ్ఎంసీ మైలర్ దేవ్ పల్లి డివిజన్‌లోని బాబుల్ రెడ్డి నగర్, పల్లె చెరువు, లక్ష్మీగూడా, శాంతి నగర్ ప్రాంతాల్లో వెలసిన శ్రీ అమ్మవారి దేవాలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ కార్యక్రమాల్లో తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు శ్రీ తోకల శ్రీనివాస్ రెడ్డి గారు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక



పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సమృద్ధి కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలతో కలిసి భక్తులను పలకరించి బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తి పరవశంలో మునిగిపోయారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు అడికే జనార్ధన్, రమేష్ రెడ్డి, మన్మోహన్ రెడ్డి, మధుసూదన్, రావుల భాస్కర్, శ్రీనివాస్, శ్రీకాంత్ రెడ్డి తదితరులు, ఆలయ కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సమాజానికి అద్దం పట్టే కలం

## విలేకరి సెనగ మల్లేష్‌కు ఘన సన్మానం

**బూర్గంపాడు/ విశాల భారతి :**



సమాజంలో జరుగుతున్న నేరాలు, ఘోరాలు, సామాజిక సమస్యలు, కుటుంబ విలువలు, యువత భవిష్యత్తు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, మహిళల భద్రత, ప్రజల హక్కులు, బాధ్యతలు వంటి అనేక కీలక అంశాలపై చైతన్యవంతమైన కథనాలు, ఆలోచన రేకెత్తించే వ్యాసాలు రాస్తూ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్న ప్రముఖ విలేకరి సెనగ మల్లేష్‌కు ఈరోజు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, సెనగ మల్లేష్ తన కలాన్ని కేవలం వార్తలకే పరిమితం చేయకుండా, సమాజంలో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకు వస్తూ, యువతలో బాధ్యతను పెంపొందించేలా వ్యాసాలు రాస్తున్నారని కొనియాడారు. సమాజంలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం, నేరాలు, కుటుంబ విభేదాలు, సామాజిక విలువల క్షీణత వంటి అంశాలపై ఆయన రాసే కథనాలు ప్రజల్లో మంచి ఆలోచనను కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. అంతేకాకుండా, వార్తల ద్వారా ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా, తన వంతు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటూ అవసరమైన వారికి అండగా నిలుస్తున్నారని తెలిపారు. నిజాయితీ, నిబద్ధత, సేవాభావంతో జర్నలిజాన్ని కొనసాగిస్తూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్న సెనగ మల్లేష్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సెనగ మల్లేష్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. కేవీ సార్ మాట్లాడుతూ, సమాజానికి మేలు చేసే వార్తలే నిజమైన జర్నలిజానికి నిదర్శనమని అన్నారు. ప్రజల సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువస్తూ, సమాజంలో చైతన్యం కలిగించే విధంగా సెనగ మల్లేష్ చేస్తున్న సేవ అభినందనీయమని పేర్కొన్నారు. ఇటువంటి విలేకరులు సమాజానికి అవసరమని, ఆయన మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. చేయూత ట్రస్ట్ చైర్మన్ కైపు లక్ష్మీనారాయణ రెడ్డి మాట్లాడుతూ, సమాజ సేవకు కలం కూడా ఒక శక్తివంతమైన ఆయుధమని అన్నారు. చేయూత ట్రస్ట్ నిర్వహించే సేవా కార్యక్రమాలకు ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తూ, ప్రజలకు ఉపయోగపడే సమాచారాన్ని అందిస్తున్న సెనగ మల్లేష్ సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. సమాజ శ్రేయస్సు కోసం ఆయన ఇలాగే నిరంతరం సేవ చేయాలని ఆకాంక్షించారు. ఆదర్శ రైతు నర్సిరెడ్డి మాట్లాడుతూ, రైతుల సమస్యలు, గ్రామీణ ప్రజల కష్టాలు, సామాన్యుల ఆవేదనలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో సెనగ మల్లేష్ పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. గ్రామీణ సమాజానికి అండగా నిలిచే జర్నలిస్టులు ఎంతో అవసరమని, ఆయన కలం ఎప్పుడూ ప్రజల పక్షాన నిలవాలని కోరుకున్నారు. మెండి భాస్కర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై రాజీ పడకుండా, నిజాయితీతో వార్తలు రాస్తూ ప్రజల్లో విశ్వాసాన్ని సంపాదించుకున్న వ్యక్తి సెనగ మల్లేష్ అని అన్నారు. యువతకు స్ఫూర్తినిచ్చే వ్యాసాలు, సమాజాన్ని ఆలోచింపజేసే కథనాలు ఆయన ప్రత్యేకత అని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి సమాజానికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. సన్మానానికి స్పందించిన సెనగ మల్లేష్ మాట్లాడుతూ, ఈ గుర్తింపు తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో కూడా ప్రజల గొంతుకగా నిలిచి సమాజ హితం కోసం నిరంతరం కలం పట్టి సేవ చేస్తానని తెలిపారు. తనను ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చేయూత ట్రస్ట్ సభ్యులు మరియు స్నేహితులు శ్రేయోభిలాషులు బంధువులు అనేకులు పాల్గొన్నారు.

## స్నేహితుల దినోత్సవం రోజున విషాదం

- నీటిలో మునిగి వ్యక్తి మృతి .. కుటుంబంలో అలుముకున్న విషాద ఛాయలు






**పాల్వంచ, విశాలభారతి :** స్నేహితుల దినోత్సవం రోజున పాల్వంచ మండలంలోని కిన్నెరసాని లో విషాద ఘటన చోటుచేసుకుంది. కొత్తగూడెం పట్టణానికి చెందిన తంగెళ్లపల్లి సంతోష్ తన స్నేహితులతో కలిసి పాల్వంచలోని కిన్నెరసాని ప్రాజెక్టును సందర్శించేందుకు వెళ్లాడు. ఈ సందర్భంగా ప్రాజెక్టు కాలువలో ఈతకు దిగిన సంతోష్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతైనట్లు సమాచారం.సమాచారం అందుకున్న పాల్వంచ రూరల్ పోలీసులు స్థానికుల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టి సంతోష్‌ను నీటిలో నుంచి బయటకు తీశారు. అయితే అత్యవసర సమయంలో 108 అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో అతని స్నేహితులే ద్విచక్ర వాహనంపై ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే సంతోష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.స్నేహితుల దినోత్సవం రోజున జరిగిన ఈ విషాదం కుటుంబ సభ్యులు, మిత్రులను తీవ్ర విషాదంలోకి నెట్టింది. ఘటనపై పాల్వంచ రూరల్ ఎస్సై సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు

## బంచరాయితండలో స్నేహితుల దినోత్సవ వేడుకలు

- కేక్ కట్ చేసి స్నేహబంధానికి నూతన నిర్వచనం
- యువత ఐక్యతకు ప్రతీకగా నిలిచిన వేడుకలు.



**కురవి విశాల భారతి:** మహబూబాబాద్ జిల్లా, కురవి మండలం బంచరాయితండ గ్రామ పంచాయతీ పరిధిలోని రామారావు నివాసం ఆదివారం స్నేహితుల సందడితో కళకళలాడింది. ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ యువకులు అత్యంత ఘనంగా వేడుకలు నిర్వహించారు. స్నేహబంధానికి ప్రతీకగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకుంటూ ఆప్యాయంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా యువత స్నేహం అనేది కేవలం ఒక రోజు జరుపుకునే పండుగ కాదని, జీవితాంతం నిలిచే గొప్ప అనుబంధమని పేర్కొన్నారు. సుఖదుఃఖాల్లో అండగా నిలిచే నిజమైన స్నేహితులే జీవితానికి నిజమైన సంపద అని వారు అభిప్రాయపడ్డారు. పరస్పర విశ్వాసం, ప్రేమ, ఆప్యాయత, సహకారం, సేవాభావంతో ముందుకు సాగాలని సంకల్పించారు. వేడుకల సందర్భంగా స్నేహితులు కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు తినిపిస్తూ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. అనంతరం స్నేహబంధానికి గుర్తుగా జ్ఞాపక ఫోటోలు దిగారు. "హ్యాపీ ఫ్రెండ్షిప్ డే" అంటూ ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకోవడంతో ఆ ప్రాంతం సందడిగా మారింది. యువతలో నెలకొన్న ఐక్యత, పరస్పర అనుబంధం అక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పున్నం, లింగన్న, రామారావు, భారత్, శీనన్న, లాల్ సింగ్, సురేష్, అశోక్, మోతిలాల్, సేట్యి, రమేష్, దేవేందర్ దేవ్ తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్నేహబంధం మనిషి జీవితంలో అత్యంత విలువైన బంధమని, కష్టకాలంలో చేయూతనిచ్చే మిత్రులను ఎప్పటికీ మరవకూడదన్నారు. ఇలాంటి వేడుకలు యువతలో ఐక్యతను, సోదరభావాన్ని మరింత పెంపొందిస్తాయని, ప్రతి సంవత్సరం మరింత ఘనంగా స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

## బండ్లగూడ జాగీర్‌లో ఉచిత న్యాయ సలహా శిబిరం నిర్వహణ



**రాజేంద్రనగర్, విశాల భారతి :** బండ్లగూడ జాగీర్ ఆర్యవైశ్య సంఘం బండ్లగూడ జాగీర్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఉచిత న్యాయ సలహా శిబిరం నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు పీరంచెరువు అంబుజా కాంప్లెక్స్‌లో (ఆనంది అపార్ట్‌మెంట్స్ ఎదురుగా) లాయర్ కె. విజయ్ కుమార్ ( ఎల్.ఎల్.బి ) కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ శిబిరంలో కుటుంబ సమస్యలు, ఆర్థిక వివాదాలు, రియల్ ఎస్టేట్, వ్యాపార, క్రిమినల్ కేసులు మరియు వినియోగదారుల హక్కులకు సంబంధించిన పలు అంశాలపై వివిధ కాలనీల నుండి వచ్చిన ప్రజలకు ఉచితంగా న్యాయ సలహాలు అందించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు రావికంటి వినయ్ కుమార్ మాట్లాడుతూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి లీగల్, మెడికల్ మరియు రక్తదాన శిబిరాలను కొనసాగించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమం అనంతరం సంఘం కమిటీ సభ్యులు లాయర్ కె. విజయ్ కుమార్‌ను శాలువాతో సత్కరించారు.

## బహదూర్ గూడలో మళ్లీ ఉద్రిక్తత – రైతుల రిలే దీక్షలు భగ్నం చేసిన పోలీసులు






**రాజేంద్రనగర్, విశాల భారతి :** శంషాబాద్ మండల పరిధిలోని బహదూర్ గూడ గ్రామంలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆదివారం ఉదయం శంషాబాద్ పోలీసులు భారీగా గ్రామానికి చేరుకుని రైతులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలను భగ్నం చేశారు. శంషాబాద్ ఇన్స్పెక్టర్‌తో పాటు పలువురు ఎస్ఐలు, పోలీసు సిబ్బంది కలిసి దీక్షలకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, ఇతర సామగ్రిని తొలగించారు. గతంలో బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం తమ భూములను సేకరించవద్దని డిమాండ్ చేస్తూ లక్ష్మీ తండాలో రైతులు దీర్ఘకాలంగా ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. ఇటీవల హైడ్రా ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖలు కలిసి సుమారు 650 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇటీవల మూడు రోజులుగా బహదూర్ గూడ గ్రామానికి చెందిన రైతులు గ్రామ చవిడిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. అయితే, ఉన్నతాధికారుల నుంచి అనుమతి లేదని తెలుపుతూ పోలీసులు ఈ దీక్షలను నిలిపివేశారు. దీంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తమను పోలీసులు అడ్డుకోవడం అన్యాయమని వారు మండిపడుతున్నారు. ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూములకు తగిన పరిహారం వెంటనే ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. పోలీసుల మళ్లీ ప్రవేశంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి.

## విశాఖ నుంచి హైదరాబాద్‌కు ఊపిరితిత్తుల రవాణా

### గ్రీన్ ఛానల్‌తో వేగవంతమైన తరలింపు



**రాజేంద్రనగర్, విశాల భారతి :** అవయవ మార్పిడి కోసం విశాఖపట్నం నుంచి తీసుకొచ్చిన ఊపిరితిత్తులను ఆదివారం ఇండిగో విమానం ద్వారా శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సురక్షితంగా చేర్చారు. అనంతరం వాటిని సికింద్రాబాద్ మినిస్టర్స్ రోడ్డులో ఉన్న కిమ్స్ ఆస్పత్రికి అత్యవసరంగా తరలించేందుకు పోలీసులు ప్రత్యేక గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేశారు. టీజీ09యూ0642 అంబులెన్స్‌లో అవయవాలను వేగంగా తరలిస్తూ మార్గ మధ్యంలో ట్రాఫిక్‌ను పూర్తిగా నియంత్రించారు. ఎలాంటి అంతరాయం లేకుండా తక్కువ సమయంలో ఆస్పత్రికి చేరేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేశాయి. అవయవ మార్పిడిలో ప్రతి క్షణం కీలకమనే నేపథ్యంలో గ్రీన్ ఛానల్ ద్వారా సమయాన్ని ఆదా చేసి రోగికి సకాలంలో అవయవం అందేలా చర్యలు చేపట్టారు. ఈ సమన్వయంతో ప్రాణరక్షణలో కీలక పాత్ర పోషించిన పోలీసులు, వైద్య బృందాన్ని అధికారులు అభినందించారు.



## 28 ఏళ్ల నాటి స్నేహం.. ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

**కోదాడ, (విశాలాభారతి):** ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని కొమరబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 1997-1998 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. దాదాపు 28 ఏళ్ల తర్వాత ఒకే వేదికపైకి వచ్చిన మిత్రులు, పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి, సామాజిక సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని పూర్వ విద్యార్థులు ఈ సందర్భంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో గురువులు, పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని సందడి చేశారు.

## వర్షాలు కురవాలని గ్రామదేవతలకు జలాభిషేకం



**కోదాడ, (విశాలభారతి):** సమృద్ధిగా వర్షాలు కురిసి, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరుతూ కోదాడ పట్టణంలోని శ్రీరంగాపురం 5, 6 వార్డుల మహిళలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక రామాలయంలో పూజల అనంతరం, మహిళలు జల బిందెలతో ఊరేగింపుగా వెళ్లారు. బొడ్రాయితో పాటు గ్రామదేవతలైన ముత్యాలమ్మ, అంకమ్మ, కట్ట మైసమ్మ తల్లులకు పవిత్ర జలాలతో అభిషేకాలు చేశారు. రైతాంగం పచ్చని పంటలతో విలసిల్లాలని అమ్మవార్లను ప్రార్థించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో కౌన్సిలర్లు కందుల కోటేశ్వరరావు, కందుల చంద్రశేఖర్, నాగేంద్రమ్మ, చిత్తలూరి శివయ్య, బెక్కం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సౌత్ ఇండియా కరాటే పోటీల్లో కోదాడ విద్యార్థుల సత్తా



**కోదాడ, (విశాలభారతి):** ఖమ్మంలో ఆదివారం నిర్వహించిన సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్ లీగ్‌లో కోదాడకు చెందిన విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీకి చెందిన కోఫోకన్ కరాటే క్లబ్ విద్యార్థులు వివిధ విభాగాల్లో పోటీపడి పలు పతకాలను కైవసం చేసుకున్నట్లు కోచ్ ఆరె మాధవీలత తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చూపిన ప్రతిభ, వారి నిరంతర కృషి ఫలితమే ఈ విజయం అని హర్షం వ్యక్తం చేశారు. పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ సయ్యద్ మహమ్మద్ పాషా, వైస్ ప్రెసిడెంట్‌లు చేతుల మీదుగా మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి కోదాడకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

## జన్మదినం సందర్భంగా రామాలయ పూజారికి ఘన సన్మానం

**మరిపెడ, విశాల భారతి:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ రామాలయం ఆలయ ప్రధాన పూజారి సుదర్శన్ బట్టర్ జన్మదినం సందర్భంగా భక్తులు ఘనంగా సన్మానించారు. ఆలయ ప్రాంగణంలో శాలువా కప్పి, పుష్పమాలలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీరాముని ఆశీస్సులు పొందారు. భక్తులు "జై శ్రీరామ్" నినాదాలతో ఆలయ ప్రాంగణాన్ని మార్మోగించారు. సుదర్శన్ బట్టర్ ఆలయ అభివృద్ధికి, ధార్మిక సేవలకు విశేష కృషి చేస్తున్నారని పలువురు కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రసాదం పంపిణీ చేశారు.



## గూడూరు బస్టాండ్‌లోని మరుగుదొడ్ల గతి ఇంతేనా..







**గూడూరు , విశాల భారతి:** గూడూరు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఉన్నటువంటి మరుగుదొడ్లలకు డోర్లు లేక పోవడం బేషన్స్ పగిలిపోవడం వాటర్ సప్లై సరిగా లేకపోవడం శుభ్రత లోపించడంతో ప్రయాణికులు చాలా ఇబ్బంది వ్యక్తం చేస్తున్నారు కాబట్టి ప్రభుత్వ అధికారులు ప్రజా ప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఈ యొక్క సమస్యను పరిష్కరించవలసిందిగా ప్రయాణికులు కోరుకోవడం జరుగుతుంది

## యాదవుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి అభినందనీయం..




- సదర్ ను రాష్ట్ర పండుగగా గుర్తించిర్రు
- మాజీ ప్రధాన సమాచార కమిషనర్, తెలంగాణ రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ సభ్యులు డాక్టర్ వరే వెంకటేశ్వర్లు యాదవ్

**ముషీరాబాద్, విశాల భారతి:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత యాదవ సమాజానికి రాజకీయ పరిపాలన రంగంలో సముచిత ప్రాధాన్యం కల్పించడం అభినందనీయకమని మాజీ ప్రధాన సమాచార కమిషనర్, తెలంగాణ రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ సభ్యులు డాక్టర్ వరే వెంకటేశ్వర్లు యాదవ్ పేర్కొన్నారు. బాగ్ లింగంపల్లి సుందరయ్య కళాభవన్‌లో జాతీయ యాదవ్ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ అధ్యక్షతన ఇటీవల వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లు ఇతర రాష్ట్రస్థాయి పదవులకు నియమితులైన యాదవ నాయకులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ప్రధాన సమాచార కమిషనర్, తెలంగాణ రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ సభ్యులు డాక్టర్ వరే వెంకటేశ్వర్లు యాదవ్ హాజరై మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి యాదవుల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నారని పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, కార్పొరేషన్ చైర్మన్‌లు తదితర కీలక పదవుల్లో అవకాశాలు కల్పిస్తున్నారని కొనియాడారు. అంతేకాకుండా యాదవుల సాంప్రదాయ పండుగ సదరును రాష్ట్ర పండుగగా గుర్తించి అన్ని జిల్లాల్లో అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం యాదవ్ సమాజ ఐక్యతను మరింత బలోపేతం చేస్తుందన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కోకాపేట యాదవ్ భవన నిర్మాణాన్ని త్వరిత గతిన ప్రారంభించి యాదవుల ఆత్మగౌరవానికి ప్రతీకగా తీర్చిదిద్దాలని కోరారు. అనంతరం వంటల జంగా యాదవ్ ఆధ్వర్యంలో యాదవ్ కంఠం పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, యాదగిరిగుట్ట దేవస్థానం పాలక మండలి సభ్యురాలు, గొర్రెల మేకల అభివృద్ధి సహకార సమాఖ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కె. సరిత తిరుపతయ్య యాదవ్, డాక్టర్ చరణ్ కౌశిక్ యాదవ్, గజ్జి భాస్కర్ యాదవ్, మారబోయిన రఘునాథ్ యాదవ్, బొంతు శ్రీదేవి యాదవ్, వాస వేణుగోపాల్ యాదవ్, ఎం.బి. కృష్ణ యాదవ్, పుల్లారావు యాదవ్, చేవెళ్ల సంపత్ యాదవ్, దేవేందర్ యాదవ్, గుడిగె శ్రీనివాస్ యాదవ్, మారమోని శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుల దినోత్సవం_ సందర్భంగా హకా రైతు సేవ కేంద్రం ఆధ్వర్యంలో హరితహారం




**తిరుమలగిరి, విశాల భారతి :** ఆదివారం రోజున:తొండ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో హాకా రైతు సేవా కేంద్రం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం 15 మొక్కలు నాటడం జరిగింది. వాటిలో వేప, మునగ, జామ మరియు నేరేడు చెట్లు ఉన్నాయి.ఈ కార్యక్రమానికి లీడ్ క్రాప్ సైన్స్ ఎంప్లాయ్ నీరటి సంతోష్, గ్రామ సర్పంచ్ భాష మల్ల స్వాతి భాస్కర్, ఉపసర్పంచ్ గొలుసుల వెంకన్న, వార్డు సభ్యులు మరియు పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు వేముల వెంకటేశ్వర్లు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లి ఎమ్మెల్యేను కలిసిన శ్రీరామ్‌నగర్ కాలనీ ఏ బ్లాక్ వాసులు

**అమ్మవారి ఆలయ నిర్మాణం, తాగునీటి సమస్య పరిష్కారానికి వినతి**



**శేరిలింగంపల్లి విశాల భారతి:** శ్రీరామ్‌నగర్ కాలనీ ఏ బ్లాక్ వాసులు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీని కలిసి కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యతో పాటు అమ్మవారి ఆలయ నిర్మాణానికి సంబంధించిన అంశాలపై వినతిపత్రం అందజేశారు.కాలనీలో తాగునీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వాటర్ వర్క్స్ మేనేజర్ సందీప్‌తో ఫోన్‌లో మాట్లాడి, ప్రతిరోజూ ఉదయం నీటి సరఫరా జరిగేలా చూడడంతో పాటు నీటి విడుదల సమయాన్ని మరింత పెంచాలని ఆదేశించారు.అమ్మవారి ఆలయ నిర్మాణానికి సంబంధించిన అంశాన్ని సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.సమస్యల పరిష్కారానికి వెంటనే స్పందించిన ఎమ్మెల్యేకు శ్రీరామ్‌నగర్ కాలనీ ఏ బ్లాక్ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాలనీ పెద్దలు, యువకులకు బలరామ్ యాదవ్ ధన్యవాదాలు తెలిపారు.

# ఇంకుడు గుంతలపై అవగాహన ర్యాలీ

**మణికొండలో విజయవంతం**




**రాజేంద్రనగర్, విశాల భారతి :** మణికొండ ఎంప్లాయిస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ (ఈసిడబ్ల్యూఏ) ఆధ్వర్యంలో మణికొండలో ఇంకుడు గుంతల ఆవశ్యకత, నీటి సంరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి స్థానికుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వర్షపు నీటిని భూగర్భ జలాల్లోకి చేరేలా చేయడం ద్వారా నీటి కొరతను నివారించవచ్చని తెలిపారు. ప్రతి ఇంటిలో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో పాల్గొన్న వారు జల సంరక్షణపై నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు. కార్యక్రమానికి మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు హాజరై నీటి పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. పర్యావరణ నిపుణులు మాట్లాడుతూ ఇంకుడు గుంతల నిర్మాణం వల్ల భూగర్భ జలాల స్థాయి పెరుగుతుందని తెలిపారు. వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవడం కాలానుగుణ అవసరమని సూచించారు. నీటి వనరుల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం ఈ దిశగా ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఈసిడబ్ల్యూఏ సభ్యులు, కాలనీ వాసులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు.

# మణికొండ నల్లపోచమ్మ బోనాల్లో వడిబియ్యం సమర్పించిన లక్ష్మీశ్రీ



**రాజేంద్రనగర్, విశాల భారతి :** రంగారెడ్డి జిల్లా మణికొండలో ఆషాఢ మాస బోనాల సందర్భంగా శ్రీ నల్లపోచమ్మ అమ్మవారి ఆలయంలో భక్తి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ లక్ష్మీశ్రీ అమ్మవారికి వడిబియ్యం సమర్పించి తన మొక్కు తీర్చుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. బోనాల పండుగను పురస్కరించుకుని ఆలయం వద్ద ప్రత్యేక అలంకరణలు ఏర్పాటు చేయగా, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సంప్రదాయ బోనాలతో మహిళలు పాల్గొని పండుగకు మరింత శోభ తీసుకొచ్చారు. భక్తుల రద్దీతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక ఉత్సాహంతో కళకళలాడాయి. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు శైలజ, వందన, బిందు, కొల్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆలయ కమిటీ సభ్యులు, మణికొండ ప్రాంత ప్రజలు, భక్తులు భారీ సంఖ్యలో హాజరై బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# శేరిలింగంపల్లిలో టీఆర్ఎస్‌లోకి భారీ చేరికలు

- **చందానగర్, మియాపూర్‌కు చెందిన 30 మంది నాయకులకు కండువాలు కప్పిన వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్**




**శేరిలింగంపల్లి, విశాల భారతి:** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో టీఆర్ఎస్ బలోపేతానికి పార్టీ ఇన్‌చార్జి వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ చర్యలు వేగవంతం చేశారు. చందానగర్, మియాపూర్ డివిజన్లకు చెందిన కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి పార్టీలకు చెందిన సుమారు 30 మంది నాయకులు ఆదివారం టీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు, 2028 అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ విజయం సాధించి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులు సమిష్టిగా పనిచేసి టీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలని, కవితను ముఖ్యమంత్రిగా చూడడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో టీఆర్ఎస్‌కు అన్ని వర్గాల ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని, భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లోనూ పార్టీ విజయపథంలో కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.పార్టీలో చేరిన వారిలో బిజిలి ప్రవీణ్, రాంభూపాల్ రెడ్డి, సూర్యప్రకాశరావు, నవీన్, శ్రీకాంత్, నాగేష్, రాజు, శ్రవణ్, బంటి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు విష్ణు, సందీప్‌తో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# భారత బ్యాడ్మింటన్‌కు దొరికిన కొత్త తార

**స్పోర్ట్స్ డెస్క్, విశాల భారతి :** భారత బ్యాడ్మింటన్‌కు మరో యువ తార దొరికింది. పంజాబ్‌కు చెందిన 17 ఏళ్ల తన్వి శర్మ తైపీ ఓపెన్ సూపర్300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుని అంతర్జాతీయ వేదికపై తన సత్తా చాటింది. ఆదివారం జరిగిన ఫైనల్లో ప్రపంచ 21వ ర్యాంకర్, వియత్నాంకు చెందిన ఆరో సీడ్ థుయ్ లిన్ న్గుయెన్‌ను 2116, 2116 తేడాతో వరుస గేముల్లో ఓడించి కెరీర్‌లో తొలి బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఈ మ్యాచ్‌ను కేవలం 36 నిమిషాల్లో ముగించిన తన్వి పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఈ విజయంతో తన్వి తైపీ ఓపెన్ చరిత్రలోనే మహిళల సింగిల్స్ టైటిల్ గెలిచిన అత్యంత పిన్న వయస్కురాలిగా రికార్డు సృష్టించింది. 17 ఏళ్ల 222 రోజుల వయసులో ఈ ఘనత సాధించిన ఆమె గతంలో చైనీస్ తైపీ దిగ్గజం తై జు యింగ్ పేరిట ఉన్న రికార్డును అధిగమించింది. అలాగే 2008లో సైనా నెహ్వాల్ తర్వాత తైపీ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ గెలిచిన తొలి భారతీయ షట్లర్‌గా నిలిచింది. ఫైనల్‌లో తన్వి ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. చాకచక్యమైన డ్రాప్ షాట్లు, వేగవంతమైన స్మాష్‌లతో ప్రత్యర్థిని ఇబ్బంది పెట్టి తొలి గేమ్‌లో 102 ఆధిక్యం సాధించింది. మధ్యలో కొన్ని తప్పిదాలతో న్గుయెన్ పుంజుకున్నా, తన్వి ఒత్తిడిని తట్టుకుని తొలి గేమ్‌ను 2116తో ముగించింది. రెండో గేమ్‌లో న్గుయెన్ 30తో ఆధిక్యంలోకి వెళ్లినా, తన్వి వెంటనే లయ అందుకుని వరుస పాయింట్లు సాధించింది. నెట్ వద్ద అద్భుతమైన షాట్లు, క్రాస్‌కోర్ట్ స్మాష్‌లతో ఆధిపత్యం కొనసాగిస్తూ రెండో గేమ్‌నూ 2116తో గెలిచి టైటిల్‌ను ఖాయం చేసింది. ఈ విజయం అనంతరం తన్వి ఆనందం వ్యక్తం చేసింది. "ఈ టైటిల్ గెలుస్తానని అసలు ఊహించలేదు. ప్రతి మ్యాచ్‌లో నా అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలనే లక్ష్యంతో బరిలోకి దిగాను.

# మణికొండ జాగీర్ ప్రభుత్వ భూమిపై మళ్లీ ఆక్రమణ యత్నం

- **నిర్లక్ష్య అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**రాజేంద్రనగర్, విశాల భారతి :**

గండిపేట మండలం మణికొండ జాగీర్‌లోని సర్వే నెం. 42 ప్రభుత్వ భూమిపై మరోసారి ఆక్రమణ యత్నం జరుగుతుండటంతో స్థానికంగా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొద్ది నెలల క్రితం నర్సింగి డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో ఈ భూమిపై ఉన్న అక్రమ ఆక్రమణలను తొలగించారు. అనంతరం ఈ భూమికి శాశ్వత ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ యాజమాన్యాన్ని సూచించే బోర్డులు ఏర్పాటు చేయాలని పలుమార్లు కోరినా, సంబంధిత శాఖలు స్పందించకపోవడం గమనార్హం. చదరపు గజానికి సుమారు రూ. 2.50 లక్షల మార్కెట్ విలువ ఉన్న ఈ ప్రభుత్వ భూమి ప్రస్తుతం మళ్లీ ఆక్రమణ ముప్పులో పడింది. ఒక ప్రైవేట్ బిల్డర్ ప్రభుత్వ బోర్డును తొలగించి, నీలం రంగు షీట్లతో కంచె ఏర్పాటు చేసి భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇది ప్రభుత్వ ఆస్తిపై ప్రత్యక్ష దాడిగా స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ వ్యవహారంపై గండిపేట తహసీల్దార్ (ఎంఆర్ఓ), ఐజీఆర్ఎస్ సబ్‌రిజిస్ట్రార్, హైడ్రా అధికారులు మరియు మున్సిపల్ అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూమిని రక్షించడంలో వీరు విఫలమయ్యారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమి బోర్డును తొలగించిన వారిపై, అలాగే ఆక్రమణకు పాల్పడిన వ్యక్తులపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరుతున్నారు. అదేవిధంగా భూమికి శాశ్వత ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ యాజమాన్య బోర్డును తిరిగి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే, ఈ భూమిపై జరిగిన రిజిస్ట్రేషన్లు మరియు అనుమతులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. నిర్లక్ష్యానికి పాల్పడిన అధికారులను సస్పెండ్ చేయాలని కూడా విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ భూమి ప్రజల ఆస్తి కావడంతో దానిని రక్షించడం ప్రతి అధికారికి బాధ్యత అని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంపై వెంటనే చర్యలు తీసుకుని భూమిని పరిరక్షించాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.




# సైబరాబాద్‌లో వీకెండ్ డ్రంక్ అండ్ డ్రైవ్ కలకలం

**ఏకంగా 333 మంది మందుబాబులు లాక్**

**సైబరాబాద్ – విశాల భారతి:** వీకెండ్ వస్తే చాలు మద్యం మత్తులో రోడ్లపైకి వచ్చి ఇష్టారాజ్యంగా వాహనాలు తోలే మందుబాబులకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కంటిమీద కునుకు లేకుండా చేశారు.వారాంతం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక వీకెండ్ డ్రంక్ అండ్ డ్రైవ్ డ్రైవ్‌లో ఏకంగా 333 మంది తాగి వాహనాలు నడుపుతూ కంటికి చిక్కారు. ఈ స్పెషల్ చెకింగ్స్‌లో దొరికిన వారిలో సింహభాగం బైకర్లే కావడం గమనార్హం. మొత్తం 269 మంది ద్విచక్ర వాహనదారులపై కేసులు నమోదు చేయగా 51 మంది కార్ల డ్రైవర్లు, 11 మంది ఆటో డ్రైవర్లు,ఇద్దరు హెవీ వెహికల్ డ్రైవర్లు పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు.రక్తంలో ఆల్కహాల్ స్థాయిలను పరిశీలించిన అధికారులకు షాకింగ్ విషయాలు వెల్లడయ్యాయి.262 మంది రక్తంలో ఆల్కహాల్ పరిమాణం 36 నుంచి 200 మిల్లీగ్రాములుగా నమోదవ్వగా, 50 మందిలో 201 నుంచి 300 మిల్లీగ్రాముల వరకు ఉన్నట్లు తేలింది.ఇక మరో 21 మందిలో అత్యంత ప్రమాదకర స్థాయిలో 301 నుంచి 550 మిల్లీగ్రాముల వరకు ఆల్కహాల్ స్థాయిలు నమోదు కావడం గమనార్హం.నిబంధనలు తీవ్రంగా ఉల్లంఘించిన వీరందరినీ కోర్టు ముందు హాజరుపరచనున్నట్లు ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు.



**డ్రంక్ అండ్ డ్రైవ్ చేసి యాక్సిడెంట్ చేస్తే పదేళ్ల జైలు!**

మద్యం సేవించి వాహనాలు నడపడం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. తాగి వాహనం నడుపుతూ ప్రాణాంతక ప్రమాదాలకు కారణమైతే నూతన చట్టం 'భారతీయ న్యాయ సంహిత-2023'లోని సెక్షన్ 105 కింద కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఈ నేరం రుజువైతే గరిష్ఠంగా 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు భారీగా ఫైన్ తప్పదని విస్పష్టంగా వెల్లడించారు.మరోవైపు గత వారం (జూలై 27 నుంచి ఆగస్టు 1 వరకు) రోజుల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులకు సంబంధించి న్యాయస్థానాలు 232 కేసులను పరిష్కరించాయి. కోర్టు విచారణ అనంతరం ముగ్గురికి జరిమానాతో పాటు జైలు శిక్ష విధించగా, ఆరుగురికి జరిమానాతో పాటు సోషల్ సర్వీస్ చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. మిగిలిన 223 మందికి ఫైన్ విధించినట్లు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు వివరించారు.



# ప్రేమను పంచిన ఐబీఎస్ విద్యార్థులు

**జాయ్ ఫౌండేషన్‌లో హృదయాలను హత్తుకున్న సేవా కార్యక్రమం**

**చేవెళ్ల, విశాల భారతి :**


ఐసీఎఫ్ఏఐ ఫౌండేషన్ ఫర్ ఉన్నత విద్య (ఐఎఫ్‌హెచ్‌ఈ) పరిధిలోని ఐబీఎస్ హైదరాబాద్‌కు చెందిన సామాజిక సంక్షేమం మరియు అభివృద్ధి విభాగం, క్లబ్ ఐనా సంయుక్త ఆధ్వర్యంలో మొకిల గ్రామంలోని జాయ్ ఫౌండేషన్ సొసైటీ వృద్ధాశ్రమంలో ఆదివారం హృదయాలను హత్తుకునే సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, విద్యార్థి సేవా వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొని వృద్ధులతో ఆప్యాయంగా మమేకమై ప్రేమ, అనురాగం పంచారు. వృద్ధులతో సుదీర్ఘంగా మాట్లాడి వారి జీవిత అనుభవాలు, మధుర జ్ఞాపకాలను ఆసక్తిగా ఆలకించారు. అనంతరం పలు వినోదాత్మక ఆటలు నిర్వహించి, పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ వారిలో ఉత్సాహాన్ని నింపారు. విద్యార్థులు, వృద్ధులు కలిసి గడిపిన ఈ క్షణాలు వృద్ధాశ్రమం మొత్తం ఆనందం, ఆప్యాయతతో కళకళలాడేలా చేశాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, సమాజంలో వృద్ధులను గౌరవించడం, వారికి కొంత సమయం కేటాయించడం, ప్రేమతో పలకరించడం వంటి చిన్న చర్యలే వారికి అపారమైన ఆనందాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, మానవీయ విలువలు, సేవా భావాన్ని పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు జట్టుగా పనిచేయడం, సామాజిక సేవలో భాగస్వాములు కావడం, పెద్దల పట్ల గౌరవం మరియు సానుభూతిని పెంపొందించుకోవడం వంటి విలువైన అనుభవాలను పొందారు. సేవ, స్నేహం, మానవత్వం, సామాజిక బాధ్యతకు ఈ కార్యక్రమం ఒక ఆదర్శ వేదికగా నిలిచింది. ఈ సేవా కార్యక్రమాన్ని శరణ్య (బాహ్య సమన్వయ ప్రతినిధి - క్లబ్ ఐనా) మరియు కీర్తి (సామాజిక సంక్షేమ విభాగం & డిజిటల్ సమన్వయ ప్రతినిధి) సమర్థవంతంగా నిర్వహించగా, క్లబ్‌కు చెందిన జూనియర్, సీనియర్ సభ్యులు అందరూ చురుకుగా పాల్గొన్నారు. కార్యక్రమంలోని మధుర క్షణాలను అందంగా చిత్రీకరించిన నజారియా చిత్రీకరణ బృందానికి, అలాగే అంకుష్ మరియు ఆయన బృందానికి నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# కేటీఆర్‌ను కలిసిన చిర్రా రవీందర్ యాదవ్

**సైకత శిల్ప చిత్రపటం అందజేత**

**శేరిలింగంపల్లి విశాల భారతి:** భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను శేరిలింగంపల్లి ఉద్యమ నాయకుడు చిర్రా రవీందర్ యాదవ్ నందినగర్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.కేటీఆర్ జన్మదినం సందర్భంగా పూరీ తీరంలో ఏర్పాటు చేసిన సైకత శిల్పానికి సంబంధించిన చిత్రపటాన్ని అందజేశారు. ఈ ప్రయత్నాన్ని కేటీఆర్ అభినందించి బాగుందని ప్రశంసించారు.ఈ సందర్భంగా శేరిలింగంపల్లి తాజా రాజకీయాలు, పార్టీ బలోపేతంపై చర్చించారు. వచ్చే ఎన్నికల్లో శేరిలింగంపల్లిలో భారత రాష్ట్ర సమితిని గెలిపించుకుంటామని, కేటీఆర్ మార్గదర్శకంలో ప్రతి ఎన్నికలో గులాబీ జెండా ఎగరేస్తామని చిర్రా రవీందర్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు.




# వారాసిగూడలో గంగపుత్ర జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా బోనాలు



**సికింద్రాబాద్, విశాల భారతి:** వారాసిగూడ గంగపుత్ర జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా బోనాల పండుగను నిర్వహించారు. డప్పు చప్పుళ్ళు, పోతరాజుల విన్యాసాలు, వలలతో మహిళలు 18 బోనాలను ర్యాలీగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. వారసిగూడ భూలక్ష్మి దేవాలయం నుండి మహిళలు నెత్తిన బోనం, అమ్మవారి తొట్టెల్లతో తరలి వెళ్లి చిలకలగూడ కట్ట మైసమ్మ ఆలయంలో అమ్మవార్లకు సమర్పించారు. గంగపుత్ర సంఘాలు, సొసైటీలు ,మహిళా సంఘాలన్నీ ఏకమై బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధిల తో పాటు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే మూట గోపాల్, నాయకులు మెట్టుసాయి, గడప శ్రీహరి,దీటి మల్లయ్య, చాట్ల సదానందం, పిల్లి శంకర్, మద్దెర్ల శ్యాంసుందర్, కాపర్తి మోహన్ కృష్ణ, రవి ప్రసాద్ గౌడ్, మేకల కీర్తి హర్ష కిరణ్,కంది నారాయణ, కంది శైలజ, హేమ, వల్లారపు శ్రీనివాస్, ఆలకుంట హరి, కరాటే రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 7న హ్యాండ్లూమ్ వాక్

**చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా**



**ముషీరాబాద్, విశాల భారతి:** జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని ఆగస్టు 7న చార్మినార్ నుండి చౌమహల్లా ప్యాలెస్ వరకు హ్యాండ్లూమ్ వాక్ నిర్వహిస్తున్నామని చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాసు తెలిపారు. ఈ మేరకు శనివారం చిక్కడపల్లిలోని చైతన్య వేదిక కార్యాలయంలో వాక్ పోస్టర్ను ఆవిష్కరించి మాట్లాడారు. జాతీయ చేనేత దినోత్సవం రోజున తెలంగాణ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాల్లో చేనేత వారోత్సవాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.7న చెప్పటబోయే ఈ హెరిటేజ్ హ్యాండ్లూమ్ వాక్ లో ప్రభుత్వ ఉన్నతాధికారులు, వివిధ రంగాల విశిష్ట నాయకులు, చేనేత కళాకారులు, చేనేత ప్రేమికులు, పౌర సమాజం, మీడియా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. భారతీయ సాంప్రదాయంలో చేనేత రంగ విశిష్టతను, చేనేత కళాకారుల వృత్తి కళా నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పే విధంగా ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించి ఈ కార్యక్రమంలో పాల్గొని భారతీయ చేనేత కళాకారులకు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత పద్మశాలి సంఘం మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు బండారి లక్ష్మి , సెక్రటరీ కొండ బత్తిని కృష్ణ సంతోషి, వై శ్రీదేవి, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన


**అనూష శ్రీనివాస్ శిష్య బృందం ప్రదర్శనకు విశేష స్పందన**



**మాదాపూర్ విశాల భారతి :** శిల్పారామం మాదాపూర్‌లో కూచిపూడి నాట్య గురువు అనూష శ్రీనివాస్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రేక్షకులను ఎంతగానో అలరించింది.మూషిక వాహన, వినాయక కౌతం, రారవేను, హంసానందిని జతిస్వరం, కులుకాగా నడవరో, సాంబశివ, వర వీణ, తరంగం, తిల్లాన అంశాలను మాన్య, శ్రీలాస్య, కింసిక, హసిత, జస్మితా, లలిత, ధనశ్రీ, మమతా, శ్రావ్య, హారిక, రేష్మ, హిమ భార్గవి తదితరులు ప్రదర్శించి మెప్పించారు. కార్యక్రమానికి ప్రముఖ నాట్య గురువులు, సంగీత విద్వాంసులు డి ఎస్ వి శాస్త్రి, పి బి భారతి, అన్న రావు, మధు శాస్త్రి ముఖ్య అతిథులుగా హాజరై కళాకారుల ప్రతిభను అభినందించారు.

# ఆదర్శ్‌నగర్‌లో ఘనంగా బోనాల జాతర

**పాల్గొన్న మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్**



**శేరిలింగంపల్లి విశాల భారతి:** ఆషాఢ మాసం సందర్భంగా ఆదర్శ్‌నగర్ కాలనీలోని శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో నిర్వహించిన జాతర, బోనాల మహోత్సవంలో మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.డివిజన్ ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఎల్లమ్మ తల్లి కళ్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ కౌన్సిలర్ సోందాస్ ఆధ్వర్యంలో జరిగిన బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. హెచ్‌సీయూ డిపో సమీపంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలోనూ ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బోనాల పండుగను వైభవంగా జరుపుకోవడం గర్వకారణమని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నానని, భవిష్యత్తులో దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు, దేవాలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఈ ఏడాదికాలం నాకు నేర్పింది అదే

నటి అనుపమ పరమేశ్వరన్ భావోద్వేగానికి లోనయ్యారు. గడచిన ఏడాదికాలం తన జీవితం ఎంతో కష్టంగా గడిచిందని, ఒకానొక దశలో మానసికంగా కృంగిపోయానని అనుపమ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశమయ్యాయి. తమిళ నటుడు ధృవ్‌విక్రమ్‌తో ఆమె ప్రేమలో ఉన్నట్టు, వారి ప్రేమకు బ్రేకప్ అయినట్టు గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో రూమర్లు వినిపిస్తున్నాయి. తాజాగా అనుపమ పరమేశ్వరన్ మాట్లాడింది ఆ విషయం పైనేనంటూ సోషల్ మీడియాలో కొత్త చర్చ మొదలైంది. ఇంకా చెబుతూ 'ఎంత కష్టపడితే అంత పరిపూర్ణత సిద్ధిస్తుంది. ఈ ఏడాదికాలం నాకు నేర్పింది అదే. ఇన్నాళ్లూ ఇతరుల కోసం బతికా. నా జీవితం కూడా నా చేతుల్లో లేదు. ఇప్పుడు నాకోసం నేను బతుకుతున్నా. నా జీవితాన్ని నా నియంత్రణలోకి తీసుకున్నా. గతాన్ని వదిలి ధైర్యంగా ముందుకు సాగుతున్నా. ఈ సందర్భంగా కొంతమందికి ఓ విషయం చెప్పాలనుకుంటున్నా. వ్యక్తిగత జీవితంలోని ప్రతి విషయాన్నీ అందరికీ చెప్పాల్సిన అవసరం లేదు' అంటూ అనుపమ ఘాటుగా స్పందించింది. మరి ఈ వ్యాఖ్యల్లో అంతర్యం ఏమిటో అనుపమకే తెలియాలి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.